thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 78| జగిత్యాల | శనివారం | 13 జూన్, 2026| ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

### అఫ్ఘన్ ముందు భారత్ భారీ స్కోరు



11



## మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

ఉప్పందించిన కాంగ్రెస్ నేత ఎవరో గుర్తించండి
రేవంత్‌కే ఫ్యూచర్ లేదు..
ఇక ఫ్యూచర్ సిటీ ఎక్కడ
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 12:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిదానికి సిట్ వేస్తుంది కదా.. ఆ పార్టీ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అంశంపైన కూడా సిట్ వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..

## శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

తెలంగాణలో ఎవరైనా రాజకీయం చేసుకోవచ్చు
కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పక్కా తెలంగాణ ద్రోహి
తెలంగాణ కోసం ఏ ఒక్క మంచి పని చేయలేదు
కెటిఆర్ చెప్పినట్లల్లా ఢిల్లీలో డ్రామాలు ఆడుతున్నాడు
మీనాక్షి సీట్ చోరీకి బిజెపి కుట్ర రాజకీయాలు
మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్
ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్‌తోనూ భేటీ

**న్యూఢిల్లీ, జూన్ 12:**
తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం

మిగతా 2వ పేజీలో..





## కాంగ్రెస్‌లో మళ్లీ కలకలం

షబ్బీర్ అలీ పేరుతో ఆడియో వైరల్
పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌పై విమర్శల ప్రచారం
గ్రూపు రాజకీయాలపై జోరుగా చర్చ
మీనాక్షి నటరాజన్ వ్యవహారంతో మళ్లీ తెరపైకి అంతర్గత విభేదాలు
హైకమాండ్ జోక్యం చేసుకుంటుందా?

**హైదరాబాద్, జూన్ 12:**
తెలంగాణ కాంగ్రెస్‌లో మరోసారి అంతర్గత విభేదాలు చర్చనీయాంశంగా మారాయి. అధికారంలో ఉన్నప్పటికీ నేతల మధ్య సమన్వయ లోపం, గ్రూపు రాజకీయాలు పార్టీకి తలనొప్పిగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ప్రభుత్వ విప్ మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడినట్లుగా ప్రచారంలోకి వచ్చిన ఓ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పార్టీ వర్గాల్లో చర్చ మొదలైంది.

**ఆడియోపై రాజకీయ దుమారం**
ప్రచారంలో ఉన్న ఆడియోలో పార్టీ అంతర్గత వ్యవహారాలు, నాయకత్వ శైలి, పదవుల కేటాయింపులపై అసంతృప్తి వ్యక్తమైనట్లు

మిగతా 3వ పేజీలో..

# ఓట్ చోరీ చేసిన బీజేపీ. ఇప్పుడు సీట్ చోరీ చేసింది'..





మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై రేవంత్ ఆవేదన
రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ కుట్ర
తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కిషన్ రెడ్డి
రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం చొరవ చూపాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 12:**
కాంగ్రెస్ నేత మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమైన విషయమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన ఈ అంశంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మీనాక్షి నటరాజన్‌కు సంబంధించి

మిగతా 2వ పేజీలో..





### చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

అవసరమైన ఖర్చు భరిస్తామని హామీ

2

## త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు



పారదర్శకంగా, వివాదరహితంగా బోర్డు నిర్వహణ
అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు
సింగరేణి యాజమాన్యానికి ఉప ముఖ్యమంత్రి భట్టి ఆదేశం
మంచిర్యాలలో నేడు 335 మందికి కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు

3

## సమ్మక్కసారక్క ప్రాజెక్టుకు మార్గం సుగమం!



ప్రాజెక్టు ఎన్‌వోసీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ
ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్‌తో మంత్రి ఉత్తమ్ కీలక భేటీ
సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్
ముంపు భూములకు చట్టబద్ధ పరిహారం చెల్లింపునకు సిద్ధం
మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 12 :**
గోదావరి నదిపై తలపెట్టిన సమ్మక్కసారక్క బ్యారేజ్/సమ్మక్క సాగర్ ప్రాజెక్టు అనుమతుల సాధనలో మరో కీలక ముందడుగు పడినట్లు నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం రాత్రి హైదరాబాద్‌కు

మిగతా 2వ పేజీలో..






## గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా మౌలిక వసతుల వృద్ధికి పెద్దపీట
ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ లో మంత్రి శ్రీధర్‌బాబు

2



## బాల కార్మిక రహిత తెలంగాణగా తీర్చిదిద్దుదాం!

3

## సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనన్న మంత్రులు
హరీశ్ రావు లాగా అవినీతి తమకు తెలియదని ఖండన

**సిద్దిపేట, జూన్ 12:**
సంక్షేమ శాఖలో అవినీతి జరిగినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుకు రోడ్లు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. తమ శాఖల్లో

మిగతా 3వ పేజీలో..







నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత
మెట్రో స్టేషన్లలో భారీ రద్దీ
బెంగళూరుకు మళ్లించిన సీఎం రేవంత్ విమానం

3



## ప్రతిపక్ష ప్రభుత్వాలే బీజేపీ టార్గెట్

ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు కుట్ర
'ఫేక్' పేరిట 30 నుంచి 35 శాతం ఓట్లను తీసేసే ప్లాన్
పాలేరు బీఎల్ఏల శిక్షణ శిబిరంలో మంత్రి పొంగులేటి

**ఏదులాపురం, జూన్ 12 :**
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రతిపక్ష పార్టీలను, వాటి ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ ప్రజాస్వామ్య విరుద్ధమైన కుట్రలకు తెరలేపిందని రెవెన్యూ, గృహ

మిగతా 3వ పేజీలో..



## ప్రపంచ వేదికపై భారత్

దేశంలో ఏ రోగానికైనా మందుంది
అలాగే బ్రహ్మోస్ క్షిపణులున్నాయి
హైదరాబాద్ పర్యటనలో రాజ్‌నాథ్‌సింగ్ వ్యాఖ్యలు
మోడీ హయాంలో భారత్ ప్రతిష్ట పెరిగిందన్న కేంద్ర మంత్రి

3

# చిన్నారి ఆర్యాంశ్‌కు సీఎం రేవంత్ అండ

హైదరాబాద్, జూన్ 12:

స్పైనల్ మస్కులర్ అట్రోఫీ టైప్2తో బాధపడుతున్న బేబీ ఆర్యాంశ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. చిన్నారికి ఉత్తమ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. ఆర్యాంశ్ చికిత్స కోసం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి సహాయం అందిస్తామని చెప్పారు.

తెలంగాణకు చెందిన ఏడాది వయసున్న ఆర్యాంశ్ ప్రాణాలను కాపాడేందుకు ఇంజెక్షన్‌కు రూ.1.5 కోట్లు అవసరం. జూన్ 20లోపు ఇంజెక్షన్ స్లాట్‌ను బుక్ చేసుకోవాలని, జులై నెలాఖరులోగా చికిత్స పూర్తిచేయాలని ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. దీంతో ప్రజల సహకారంతో ఇప్పటివరకు రూ.75 లక్షలను తల్లిదండ్రులు సేకరించారు. మరో రూ.75 లక్షలు కావాల్సి ఉండగా, ఆ నిధుల సమీకరణకు ప్రభుత్వ సాయంపై ఆశలు పెట్టుకున్నారు.

చిన్నారి ఆరోగ్య పరిస్థితి, కావాల్సిన నిధులపై యూట్యూబర్ ఆదిరెడ్డి సోషల్ మీడియా వేదిక ఎక్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆదిరెడ్డి పోస్ట్‌కు సీఎం వెంటనే స్పందించారు. "చిన్నారికి ఉత్తమ చికిత్స అందేలా చేస్తాం. సీఎంఆర్ఎఫ్ అధికారులు ఆ చిన్నారి తల్లిదండ్రులను సంప్రదిస్తారు. ఆర్యాంశ్ పూర్తిగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా" అని ఎక్స్‌లో రేవంత్ పోస్ట్ చేశారు. సీఎం ఆదేశాలతో సీఎంఆర్ఎఫ్ అధికారులు తక్షణమే చిన్నారి ఆర్యాంశ్ తల్లిదండ్రులను సంప్రదించనున్నారు.

# మీనాక్షి వ్యవహారంపై సిట్ వేయగలరా?

మొదటిపేజీ తరువాయి

ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు వెళ్లకుండా అడ్డుకున్న అంశంపై ఆయన స్పందించారు. బీజేపీలో ఎవరికి ఫ్రెండ్స్ ఉన్నారో, మీనాక్షి నటరాజన్ అంటే ఎవరికి కోపం ఉందో వాళ్లే కేసు గురించి ఎన్నికల కమిషన్‌కు చెప్పి ఉంటారన్నారు. మీడియాతో కేటీఆర్ చిట్‌చాట్‌లో తన అభిప్రాయాలను వెల్లడించారు. రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీలో ఉన్న 'బ్లాక్ షీప్' ఎవరో కనుక్కోవాలి. కాంగ్రెస్ పార్టీ అంటేనే కంపు. అలాంటి కాంగ్రెస్ కంపులో ద్రోహాల పార్టీ అంశంలో మమ్మల్ని ఎందుకు లాగుతున్నారు? మీనాక్షి నటరాజన్ అంటే పడని వారే ఈ పని చేశారు. మీనాక్షి నటరాజన్‌కు తెలంగాణ కాంగ్రెస్‌లో ఎవరు వ్యతిరేకులో ప్రజలందరికీ తెలుసన్నారు. ముమ్మాటికీ ఆయన చేసిన పనినే ఇది. కాంగ్రెస్ పార్టీనే కుట్రలు చేసుకొని అందులో ప్రతిపక్షాలను ఎందుకు లాగుతున్నారో తెలుసుకోవాలి. కాంగ్రెస్ పార్టీలో పదవులు, డబ్బులకే వస్తున్నాయని షబ్బీర్ అలీ చెప్పినందుకు అభినందనలు. షబ్బీర్ అలీ ఇప్పటికైనా ఉన్న వాస్తవాన్ని ప్రజల ముందు గట్టిగా చెప్పారు. అసలు గతంలో పీసీసీ పదవిని పైసలకు అమ్ముకున్నది కాంగ్రెస్ పార్టీనే కదా! ఆ తర్వాత ముఖ్యమంత్రి పదవిని కూడా డబ్బులకే అమ్ముకున్నదని ఆరోపించారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రి కూడా డబ్బులు పెట్టి పదవి కొనుక్కున్న వ్యక్తే కదా! రేవంత్ రెడ్డి పేమెంట్ కోటా సీటు అన్న విషయం అందరికీ తెలుసు. ప్రతి నెలా డబ్బుల మూట పంపితేనే ఆయన పదవి ఉంటుంది. రేవంత్ రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు, రెన్యూవల్ సీఎం అని అందరికీ తెలుసు. కాబట్టి, షబ్బీర్ అలీ చెప్పిన మాటలు ముమ్మాటికీ వాస్తవమన్నారు. ఎయిర్‌పోర్టు మెట్రో పూర్తయితే ఇంత ట్రాఫిక్ ఉండదు, కానీ ఆ ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ఆపేశాడని ఆరోపించారు. ఉన్న నగరాన్ని గాలికి వదిలేసి ఫ్యూచర్ సిటీ అనడం ఏంటని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ అని ఊహల్లో బతుకుతున్నాడని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌ను మరింతగా అభివృద్ధి చేస్తే సరిపోతుందన్నారు. రేవంత్ రెడ్డికే ఫ్యూచర్ లేదు.. ఇంకా ఫ్యూచర్ సిటీ ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనతో రాష్ట్రం 40 ఏండ్లు వెనక్కి పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్నటి ఒక్క వర్షానికే నగరం చెరువులను తలపించిందన్నారు. దీనికి రేవంత్ రెడ్డి చేతకానితనమే కారణమన్నారు. ఎక్కడో ఒకచోట ఒకటి, రెండు చెరువులు బాగు చేసి గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. కానీ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వందల చెరువులను సుందరీకరించామని గుర్తు చేశారు. ఇకనైనా అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. జులైలో కేంద్రం మళ్లీ డీలిమిటేషన్ బిల్లు తెస్తుందని మాకు సమాచారం ఉందన్నారు. దేశం మొత్తం కాకున్నా తెలంగాణ, ఏపీలోని యోజకవర్గాల సంఖ్య పెంచాలన్నారు. జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో చూడాలన్నారు. డీలిమిటేషన్‌లో దక్షిణాదికి ఉన్న 24 శాతం వాటా తగ్గితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలను శిక్షిస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం చేస్తే సహించే ప్రసక్తే లేదన్నారు.



# ఏఐతో నేరగాళ్ల ఆట కట్టించే తెలంగాణ పోలీసులు

హైదరాబాద్, జూన్ 12:

సాంకేతికతతో పాటు నేరాల స్వరూపం కూడా వేగంగా మారుతున్న నేపథ్యంలో తెలంగాణ పోలీసులు కృత్రిమ మేధస్సును ప్రధాన ఆయుధంగా మలచుకుంటున్నారు. నేర పరిశోధన, డేటా విశ్లేషణలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ హైదరాబాద్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్‌లను రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ శుక్రవారం ప్రారంభించారు.

ఏఐ ఆధారిత స్మార్ట్ క్రైమ్ అనలిటిక్స్ సిస్టమ్ ద్వారా దర్యాప్తు ప్రక్రియలో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. నేరాలకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా విశ్లేషించి కేసుల పురోగతిని మరింత సమర్థవంతంగా నిర్వహించేలా ఈ వ్యవస్థను రూపొందించారు.

**మాట్లాడే వారిని గుర్తించే స్మార్ట్ కెమెరాలు**

సీఐడీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్‌లు అత్యాధునిక సాంకేతికతతో రూపొందించబడ్డాయి. స్మార్ట్ కెమెరాలు మాట్లాడుతున్న వ్యక్తిని స్వయంచాలకంగా గుర్తించి అతని వైపు తిరిగి జూమ్ అవుతూ ఆడియో, వీడియోలను రికార్డు చేస్తాయి. మానిటర్లు లేదా డిజిటల్ బోర్డులపై ప్రదర్శించే సమాచారాన్ని గుర్తించి క్షణాల్లో టెక్స్ట్, ఆడియో లేదా నివేదిక రూపంలోకి మార్చగల సామర్థ్యం వీటికి ఉంది. కృత్రిమ మేధస్సు సాయంతో నేరాలకు సంబంధించిన సమాచారాన్ని విశ్లేషించి క్రైమ్ మ్యాపింగ్, డేటా ఫిల్టరింగ్, కేసుల సమీక్షలను కచ్చితత్వంతో నిర్వహించవచ్చని అధికారులు తెలిపారు.

**సాంకేతికత వినియోగంలో తెలంగాణ ముందంజ**

ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ, పోలీసుల విధి నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడం అత్యంత కీలకమన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాల నియంత్రణలో సాంకేతికత పాత్ర మరింత పెరిగిందని పేర్కొన్నారు.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర పోలీసులు పలు వినూత్న ఆవిష్కరణలతో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణ, డిజిటల్ ఫోరెన్సిక్ దర్యాప్తు, క్రైమ్ అనలిటిక్స్ రంగాల్లో విశేష పురోగతి సాధించారని తెలిపారు. ఇటీవల ఏర్పాటు చేసిన టీస్పార్క్ వంటి ప్రత్యేక బృందాలు కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని గుర్తు చేశారు.

**డిజిటల్‌గా బాధితుల వాంగ్మూలాలు**

సమావేశాల్లో చర్చించిన ప్రతి అంశాన్ని ఈ ల్యాబ్‌లో డిజిటల్ రూపంలో భద్రపరిచే సౌకర్యం కల్పించారు. బాధితులు, ఫిర్యాదుదారుల అభిప్రాయాలను కూడా డిజిటల్ విధానంలో నమోదు చేసే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారు. దీంతో కేసుల పురోగతి, దర్యాప్తు నాణ్యత, ప్రజల స్పందనను ఎప్పటికప్పుడు సమీక్షించడం సులభం కానుంది. అలాగే సీసీటీఎన్ఎస్ వేదికపై డేటా నిర్వహణ, విశ్లేషణ, ధ్రువీకరణ ప్రక్రియలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా జరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏఐ ల్యాబ్‌లు భవిష్యత్తులో తెలంగాణ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేసే కీలక మైలురాయిగా నిలుస్తాయని డీజీపీ సీవీ ఆనంద్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీజీ ఏసీబీ, సీఐడీ చారు సిన్హా, డీఐజీలు నవీన్ కుమార్, నారాయణ నాయక్, పరిమళ హనా నూతన్, ఎస్పీ మద్దిపాటి శ్రీనివాస్‌తో పాటు పలువురు సీఐడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఓట్ చోరీ చేసిన బీజేపీ.. ఇప్పుడు సీట్ చోరీ చేసిందిʼ..

మొదటిపేజీ తరువాయి

ఎలాంటి కేసు లేకపోయినా ఆమె నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ రిటర్నింగ్ అధికారి తప్పుగా వ్యవహరించారని, బీజేపీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకున్నారని రేవంత్ ఆరోపించారు. రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ ముగ్గురు అభ్యర్థులను బరిలోకి దించడం వెనుక కూడా కుట్ర ఉందని అన్నారు. ఈ వ్యవహారంలో నితిన్ నబీన్, ఎన్నికల అధికారుల పాత్రపై అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. గాంధేయవాది అయిన మీనాక్షి నటరాజన్‌ను రాజ్యసభకు రాకుండా అడ్డుకోవడమే ఈ చర్యల వెనుక ఉద్దేశమని విమర్శించారు. మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి ఎఫ్ఐఆర్ లేదని, ఒక ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా కోర్టు నోటీసులు జారీ కావడం సాధారణ ప్రక్రియ మాత్రమేనని రేవంత్ స్పష్టం చేశారు. ఆ ఫిర్యాదులో ఉన్న వ్యక్తిగత వివాదాలకు ఆమెకు ఎలాంటి సంబంధం లేదన్నారు. బీజేపీ ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీస్తోందని ఆరోపిస్తూ, "ఇన్నాళ్లు బీజేపీ ఓట్ల చోరీ చేస్తుందని అనుకున్నాం.. ఇప్పుడు సీట్ల చోరీ కూడా చేస్తోంది" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**కిషన్ రెడ్డిపై మరోసారి విమర్శలు**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై కూడా రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డేనని ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన అంశాలను కేంద్రం ముందు ప్రస్తావించడంలో ఆయన విఫలమయ్యారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీకి తెలంగాణ సమస్యలపై కనీసం ఒక్క లేఖ అయినా కిషన్ రెడ్డి రాశారా అని ప్రశ్నించారు. కేంద్రంలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రిగా తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ మెట్రో రెండో దశ, ఐఆర్ఎఫ్‌సీ రుణాలు సహా కీలక ప్రాజెక్టులు ఎందుకు ముందుకు సాగడం లేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి వరకు మెట్రో విస్తరణ విషయంలో కూడా రాజకీయ కారణాలతో అడ్డంకులు సృష్టిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టుల విషయంలో రాజకీయాలను పక్కనపెట్టాలని సూచించారు.

**తెలంగాణ ప్రాజెక్టులపై కేంద్రం చొరవ చూపాలి**

పోలవరం ప్రాజెక్టు కోసం ఆంధ్రప్రదేశ్‌కు ఏడు మండలాలను బదిలీ చేసిన కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రాజెక్టులకు అవసరమైన 1,500 ఎకరాల భూమి సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని రేవంత్ ప్రశ్నించారు. తెలంగాణమహారాష్ట్ర మధ్య ఉన్న ఈ అంశంపై కేంద్రం ముందుండి చొరవ తీసుకోవాలని కోరారు. తెలంగాణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులను కేంద్ర కేబినెట్ ముందుకు తీసుకురావాలని, అందుకు కిషన్ రెడ్డి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని, తెలంగాణకు రావాల్సిన నిధులు, ప్రాజెక్టుల కోసం అన్ని పార్టీలు కలిసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# శాంతిభద్రతల కారణంగానే పవన్ సభకు నిరాకరణ

మొదటిపేజీ తరువాయి

చేశారు. ఎవరు ఎక్కడైనా రావచ్చు..పోవచ్చన్నారు. ఇందుకు పవన్ కళ్యాణ్ అతీతుడు కాదన్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణకు వచ్చివెళ్లేందుకు, పోటీ చేసేందుకు పవన్‌కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే పవన్ విషయంలో మా మంత్రులు స్పందించారు.. శాంతిభద్రతల కారణంతోనే ఆయన సభకు అనుమతి ఇవ్వలేదు.. ఏపీలో చాలాసార్లు జగన్ సభలకు అనుమతి ఇవ్వలేదు.. ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని చెప్పారు. ప్రధాని మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని మరోమారు కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్క సారైనా మాట్లాడారా అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడైనా తెలంగాణకు అనుకూలంగా మాట్లాడినట్లు నిరూపించాలన్నారు. ఎవరి వద్ద వ్యతిరేకంగా మాట్లాడారో వాళ్లే నాకు చెప్పారు. పోలవరం కోసం 5 మండలాలను ఏపీలో కలిపారు.. అదేరీతిలో తెలంగాణ కోసం మహారాష్ట్ర నుంచి 1500 ఎకరాలు సాధించలేరా అని నిలదీశారు. మహారాష్ట్రను ఒప్పించే వరకు కేబినెట్ సమావేశానికి రానని కిషన్‌రెడ్డి, రాజీనామా చేస్తామని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు చెప్పలేరా? ఆ పార్టీ ఎంపీలు గట్టిగా అడిగితే రాష్ట్రానికి నిధులు వస్తాయి కదా.. రీజినల్ రింగ్ రోడ్డును కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. కేటీఆర్ చెప్పినట్లు కిషన్‌రెడ్డి డ్రామా ఆడుతున్నారని మండిపడ్డారు. గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. రిటర్నింగ్ అధికారి (ఆర్వో) బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారని విమర్శించారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను భాజపా ఆదర్శంగా తీసుకుందని.. ఆ పార్టీ నేతలు ఆయనలా ప్రవర్తిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌తో సిఎం రేవంత్ భేటీ అయ్యారు.




# సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు మార్గం సుగమం!

మొదటిపేజీ తరువాయి

వచ్చిన ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఘనంగా స్వాగతించారు. అనంతరం నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారుల బృందంతో కలిసి ఆయనతో మంత్రి ఉత్తమ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో తలపెట్టిన సమ్మక్కసారక్క ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను కేంద్ర జల సంఘం తుది పరిశీలనకు తీసుకెళ్లేందుకు అవసరమైన అభ్యంతర రహిత పత్రం(ఎన్‌వోసీ) జారీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ వినతి పత్రాన్ని సమర్పించారు. సమ్మక్కసారక్క బ్యారేజ్ రాష్ట్ర రైతాంగానికి అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని వివరించారు. విష్ణుదేవ్ సాయి మన విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారని, సానుభూతితో పరిశీలిస్తామని హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. ఈ పరిణామం ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియలో కీలక మలుపుగా నిలుస్తుందన్నారు. కేంద్ర జల సంఘంలోని అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ మినహా మిగతా అన్ని ప్రధాన డైరెక్టరేట్ల నుంచి ప్రాజెక్టుకు ఇప్పటికే అనుమతులు లభించాయని మంత్రి వెల్లడించారు. ఎన్‌వోసీ లేనందునే డీపీఆర్ తుది పరిశీలన నిలిచిపోయిన విషయాన్ని విష్ణుదేవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రాజెక్టు ముంపు, బ్యాక్‌వాటర్ ప్రభావిత ప్రాంతాలపై ఇరు రాష్ట్రాల ఇంజినీర్లు ఇప్పటికే సంయుక్త సర్వే నిర్వహించారని, మరింత ఖచ్చితమైన సర్వే కోసం ఛత్తీస్‌గఢ్ కోరగా తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించిందని చెప్పారు. సర్వే ఖర్చుల కోసం రూ.9.883 కోట్లను 2026 ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్ జలవనరుల శాఖకు విడుదల చేసినట్లు ఆయన వివరించారు. ముంపు లేదా బ్యాక్‌వాటర్ ప్రభావిత భూములు గుర్తించిన పక్షంలో చట్టబద్ధంగా పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అవసరమైతే పరిహార మొత్తాన్ని ముందుగానే డిపాజిట్ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నట్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నారు. 2009 ఫిబ్రవరి 10న జారీ చేసిన జీవో నెం.27 ద్వారా ప్రాజెక్టుకు పరిపాలనా అనుమతి లభించిందని, 2012 మార్చి 2న కేంద్ర జల సంఘం డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నీటిపారుదల రంగ పునర్వ్యవస్థీకరణలో భాగంగా ప్రాజెక్టును పునఃరూపకల్పన చేశారని మంత్రి తెలిపారు. సాంకేతిక అధ్యయనాల అనంతరం బ్యారేజ్‌ను ములుగు జిల్లాలోని తుపాకులగూడెం వద్ద నిర్మించడం సాంకేతికంగా, ఆర్థికంగా మరింత ప్రయోజనకరమని తేలిందన్నారు. ఈ మార్పుతో ఛత్తీస్‌గఢ్‌లో ముంపు ప్రభావం గణనీయంగా తగ్గిందని వివరించారు.

**ఆయకట్టు స్థిరీకరణ**

ఈ బ్యారేజ్ ద్వారా గోదావరి నుంచి 46.96 టీఎంసీల నీటిని మళ్లించి ఎస్సారెస్పీ స్టేజ్2 కింద 4.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించనున్నట్లు, అదనంగా రామప్పపాకాల లింక్ కాలువ ద్వారా మరో 30 వేల ఎకరాలకు కొత్తగా సాగునీటి సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా సూర్యాపేట జిల్లాలో 2,34,199 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 96,494 ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 85,774 ఎకరాలు, వరంగల్ జిల్లాలో 22,422 ఎకరాలు, జనగామ జిల్లాలో 1,111 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణకు ప్రయోజనం కలుగుతుందని ఆయన తెలిపారు. రామప్పపాకాల లింక్ ద్వారా ములుగు జిల్లాలో 8వేల ఎకరాలు, వరంగల్ నర్సంపేట ప్రాంతంలో 22వేల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉందన్నారు. ఇదేకాక జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకంలోని కొంత ఆయకట్టు స్థిరీకరణకు కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లోని వందలాది గ్రామాలకు తాగునీటి ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. పాజెక్టు డీపీఆర్‌ను 2021 ఆగస్టు 31న కేంద్ర జల సంఘానికి సమర్పించగా హైడ్రాలజీ డైరెక్టరేట్, కాస్ట్ ఎస్టిమేట్స్ డైరెక్టరేట్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, కేంద్ర భూగర్భ జల మండలి సహా పలు ప్రధాన అనుమతులు ఇప్పటికే లభించాయని చెప్పారు. 2024 జూలై నుంచి 2026 జనవరి వరకు కేంద్ర జల సంఘం కోరిన వివరణలన్నింటికీ తెలంగాణ నీటిపారుదల శాఖ సమగ్ర సమాధానాలు సమర్పించిందన్నారు. ఎన్‌వోసీ సాధన కోసం ప్రభుత్వం రెండేళ్లుగా నిరంతరంగా కృషి చేస్తోందన్నారు. 2025 సెప్టెంబర్ 22న రాయ్‌పూర్‌లో ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రిని స్వయంగా కలిసి ఇదే అంశాన్ని ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. అంతేగాక కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్, కేంద్ర జల సంఘం ఛైర్మన్‌తో కూడా చర్చలు జరిపినట్లు మంత్రి తెలిపారు. 2025 నవంబర్, డిసెంబర్‌లల్లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ప్రత్యేక విజ్ఞప్తులు పంపి అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినట్లు వివరించారు. ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతుండటం, తెలంగాణ ప్రభుత్వం అవసరమైన నిధులు విడుదల చేయడం, ముంపు ప్రభావితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ముందుకు రావడం, రెండు రాష్ట్రాల మధ్య సానుకూల వాతావరణం నెలకొనడం వల్ల త్వరలోనే ఎన్‌వోసీ లభించే అవకాశాలు మెరుగయ్యాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ ఎనఓసీ జారీ చేసిన వెంటనే కేంద్ర జల సంఘం అంతర్‌రాష్ట్ర వ్యవహారాల డైరెక్టరేట్ డీపీఆర్ తుది పరిశీలన పూర్తి చేస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ తెలిపారు. రైతుల ప్రయోజనాలు, సాగునీటి భద్రత, తాగునీటి అవసరాలు, అంతర్‌రాష్ట్ర సత్సంబంధాలు.. ఈ నాలుగు అంశాలను దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోందని మంత్రి ఉత్తమ్ కుమార్ అన్నారు.



# గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణ

హైదరాబాద్, జూన్ 12 :

గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తెలంగాణను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. రాబోయే రోజుల్లో ఈ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ, సరికొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా రాష్ట్రంలో 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం'ను చిత్తశుద్ధితో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్ టీసీసీఐ) ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ నోవాటెల్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఎగుమతుల సన్నద్ధత సూచీలో దేశవ్యాప్తంగా తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచిందన్నారు. అదే సముద్ర తీరం లేని రాష్ట్రాల( ల్యాండ్‌లాక్డ్) జాబితాలో రెండో స్థానంలో ఉందన్నారు. మర్చంటైజ్ ఎగుమతుల్లో దేశంలోనే ఏడో స్థానంలో నిలవడం తెలంగాణ పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు. తెలంగాణ రైజింగ్2047 విజన్ లక్ష్యసాధనలో 'లాజిస్టిక్స్' రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. తెలంగాణకు సముద్ర తీరం లేకపోవడాన్ని ఒక పరిమితి(లిమిటేషన్)గా కాక ఒక డిజైన్ అడ్వాంటేజ్‌గా మార్చుకుంటున్నామన్నారు. లాజిస్టిక్స్ పాలసీ 2.0 ద్వారా రాష్ట్రంలో మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్‌హౌసింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి పెద్దపీట వేయబోతున్నామన్నారు. లాజిస్టిక్ రంగానికి అవసరమైన రెడీ టు స్కిల్డ్ వర్క్‌ఫోర్స్ తయారీకి అత్యంత ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్‌ను లాజిస్టిక్ రంగంలోనూ సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తున్నామన్నారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, రైల్ లింక్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రేడ్ ఎ వేర్‌హౌసింగ్, ఆటోమేషన్, డిజిటల్ లాజిస్టిక్ ప్లాట్‌ఫామ్స్, గ్రీన్ మొబిలిటీ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను మంత్రి శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ ఆర్.రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కేకే మహేశ్వరి, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గరిమెళ్ల, షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ కమిటీ చైర్మన్ కమల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

# బాల కార్మిక రహిత తెలంగాణగా తీర్చిదిద్దుదాం!

“వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వలస కుటుంబాల పిల్లలు భవన నిర్మాణ రంగంలో కూడా పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు వేసే కాలంలో, పత్తి కోత సమయంలో వందలాది మంది పిల్లలు బడులు మానేసి పనులకు వెళ్తున్నారు. ముఖ్యంగా గద్వాల ప్రాంతంలోని పత్తి విత్తనాల తోటల్లో బాల కార్మిక వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతర తనిఖీలు చేపట్టాలి..”

ప్రతి ఏడాది జూన్ 12న ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడమే కాకుండా, ప్రతి చిన్నారికి విద్య, రక్షణ, గౌరవప్రదమైన బాల్యాన్ని అందించాలనే సంకల్పాన్ని ప్రపంచ దేశాలు ఈ సందర్భంగా పునరుద్ఘాటిస్తాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం “బాల కార్మిక రహిత తెలంగాణ” దిశగా స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే -2024పై స్వతంత్ర నిపుణుల వర్కింగ్ గ్రూప్ చేసిన విశ్లేషణ ప్రకారం రాష్ట్రంలో సుమారు 89 వేల మంది బాల కార్మికులు ఉన్నట్లు వెల్లడైంది. వీరిలో అధిక శాతం రోజువారీ కూలీలుగా పనిచేస్తున్నారు. బాల కార్మికులలో 14 శాతం ఎస్సీ మాదిగ పిల్లలు, 11 శాతం ఎస్టీ లంబాడా పిల్లలు ఉన్నట్లు సర్వే వెల్లడించింది. ఇదే నివేదిక విద్యారంగంలో తీవ్రమైన అసమానతలను కూడా బయటపెట్టింది.సర్వేలు నిర్వహించడం మాత్రమే ప్రభుత్వ బాధ్యత కాదు. వాటి ఆధారంగా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన విధానాలు, కార్యాచరణ చేపట్టడమే అసలు లక్ష్యం కావాలి.

రాష్ట్రంలో ఉన్న బాల కార్మికులను గుర్తించి, కార్మిక శాఖ మరియు విద్యాశాఖ సంయుక్తంగా పని చేసి వారిని పనుల నుండి విముక్తి చేసి తిరిగి పాఠశాలల్లో చేర్పించాలి. ప్రత్యేక బ్రిడ్జ్ కోర్సులు నిర్వహించాలి. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాలి.

తెలంగాణకు పెద్ద ఎత్తున వలస కుటుంబాలు వస్తున్నాయి. వారితో పాటు చిన్నారులు కూడా పనులకు వస్తున్నారు. ఇటీవల నెల్లూరు ప్రాంతం నుండి నిజామాబాద్ జిల్లా ఇటుక బట్టీలకు తీసుకువచ్చిన వెట్టి చాకిరి బాధితులలో సుమారు 200 మంది పిల్లలు ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. ఇటుక బట్టీలలో పనిచేస్తున్న బాల కార్మికులను వెంటనే రక్షించి పాఠశాలల్లో చేర్పించాలి. ఆరేళ్లలోపు చిన్నారుల కోసం యాజమాన్యాలు తప్పనిసరిగా క్రెచ్ సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలి.

అలాగే, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన వలస కుటుంబాల పిల్లలు భవన నిర్మాణ రంగంలో కూడా పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు వేసే కాలంలో, పత్తి కోత సమయంలో వందలాది మంది పిల్లలు బడులు మానేసి పనులకు వెళ్తున్నారు. ముఖ్యంగా గద్వాల ప్రాంతంలోని పత్తి విత్తనాల తోటల్లో బాల కార్మిక వ్యవస్థ ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ రంగాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతర తనిఖీలు చేపట్టాలి. ఒకప్పుడు జాతీయ స్థాయిలో జాతీయ బాల కార్మిక ప్రాజెక్టు (ఎన్సీ ఎల్పీ ) ద్వారా బాల కార్మికులను రక్షించి విద్యలోకి తీసుకువచ్చే కార్యక్రమం అమలులో ఉండేది. గత పన్నెండు సంవత్సరాలుగా ఈ పథకం నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో తెలంగాణ ప్రభుత్వం స్వంతంగా ప్రత్యేక బాల కార్మిక నిర్మూలన విధానాన్ని రూపొందించి అమలు చేయాలి.

ఈ రోజు “రైజింగ్ తెలంగాణ”, “మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ” గురించి అనేక ప్రకటనలు వినిపిస్తున్నాయి. కానీ బాల కార్మిక వ్యవస్థ కొనసాగుతున్న సమాజం నిజమైన అభివృద్ధిని సాధించలేదు. ప్రతి చిన్నారి పాఠశాలలో ఉంటేనే రాష్ట్రం మానవ వనరుల్లో బలపడుతుంది. విద్యలో పెట్టుబడి పెట్టినప్పుడే భవిష్యత్తు ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుంది. అందువల్ల ఈ జూన్ 12ను కేవలం ఒక దినోత్సవంగా కాకుండా, “బాల కార్మిక రహిత తెలంగాణ” నిర్మాణానికి నాంది పలికే రోజుగా మార్చుకుందాం.



ఆర్. వెంకట రెడ్డి
ఎం. వి. ఫౌండేషన్

## కాంగ్రెస్‌లో మళ్లీ కలకలం

మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యవహార శైలిపై విమర్శలు ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది. అయితే ఆ ఆడియో ప్రామాణికతపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు.

**గ్రూపు రాజకీయాలపై చర్చ**

కాంగ్రెస్‌లో పాత, కొత్త నాయకత్వాల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోందనే చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. కొందరు సీనియర్ నేతలు పార్టీ వ్యవహారాలపై అసంతృప్తిగా ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతోంది. సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసే క్రమంలో నాయకత్వానికి సవాళ్లు ఎదురవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**మీనాక్షి వ్యవహారం తర్వాత మరో వివాదం**

ఇటీవల మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారం కాంగ్రెస్‌లో చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ ఘటనకు సంబంధించిన సమాచారం పార్టీ అంతర్గత వర్గాల నుంచే బయటకు వెళ్లిందనే ఆరోపణలు కూడా అప్పట్లో వినిపించాయి. ఇప్పుడు తాజా ఆడియో వ్యవహారం ఆ చర్చలకు మరింత బలం చేకూర్చింది.

**హైకమాండ్ వైఖరిపై ఆసక్తి**

వరుసగా వెలుగులోకి వస్తున్న పరిణామాల నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులపై పార్టీ అధిష్టానం ఎలా స్పందిస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది. అధికారంలో ఉన్న సమయంలోనే అంతర్గత విభేదాలు బహిర్గతం కావడం పార్టీ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ వివాదాలపై హైకమాండ్ జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దుతుందా లేదా అనేది చూడాల్సి ఉంది.

# సంక్షేమ శాఖలో అవినీతి అంతా అబద్ధం

మొదటిపేజీ తరువాయి

తప్పు జరిగిందనేందుకు ఎలాంటి విచారణకైనా తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ విలేకరులతో మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా తాను, మైనార్టీ శాఖ మంత్రిగా అజారుద్దీన్, ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారని పేర్కొన్నారు. మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా, మంత్రులతో సంబంధం లేకుండా ప్రిన్సిపల్ సెక్రటరీ సవ్యసాచి ఘోష్‌కు నిర్ణయాధికారం ఇచ్చామని గుర్తు చేశారు.

అయితే అవినీతి జరిగిందంటూ హరీశ్ రావు అవగాహన లేకుండా మాట్లాడి తన స్థాయిని తగ్గించుకుంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో చేసిన విధంగా అవినీతి జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లు ఉందని ఎద్దేవా చేశారు.

మంత్రులు అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్ పక్షాన చెబుతున్నానని.. సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని రుజువు చేస్తే దేనికైనా సిద్ధమన్నారు. పేదలకు విద్య, నాణ్యమైన ఆహారం అందాలనే ఆలోచన తమకు ఉందని తెలిపారు. అవినీతి జరిగిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఖండించారు. ఈ అవినీతిపై చర్చించేందుకు మీరు తేదీ, సమయం నిర్ణయించండి.. చర్చిద్దామంటూ హరీశ్ రావుకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సవాల్ విసిరారు. గురుకుల విద్యార్థుల షూస్, యూనిఫాం, పుస్తకాల టెండర్‌లో రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందన్న హరీశ్ రావు ఆరోపణలను తాను ఖండిస్తున్నట్లు చెప్పారు. తాము జాతీయ స్థాయిలో టెండర్లు పిలిచామని గుర్తు చేశారు. మొత్తం టెండర్ విలువే రూ.687 కోట్లు అని వివరించారు. రూ.2 వేల కోట్ల అవినీతి జరిగిందని హరీశ్ రావు పచ్చి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. వారు అవినీతి చేసినట్లే తాము చేశామని అనుకుంటున్నారా? అంటూ బీఆర్ఎస్ నేతను మంత్రి సూటిగా ప్రశ్నించారు. ఏడు లక్షల మంది విద్యార్థుల భవిష్యత్ కోసం తాము మంచి ఆలోచన చేస్తే హరీశ్ రావుకు అక్కసు ఎందుకని ప్రశ్నించారు. మీరు గురుకులాలకు ఒక్క కొత్త భవనం అయినా నిర్మించారా? ఎస్సీ విద్యార్థుల కోసం ఒక్క హాస్టల్ భవనం అయినా కట్టించారా? అని హరీశ్ రావుకు ప్రశ్నలు సంధించారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ హరీశ్ రావుకు స్పష్టం చేశారు. ప్రభుత్వ సంస్థలకు కూడా కొంత శాతం ప్రొక్యూర్‌మెంట్‌కు అవకాశం ఇచ్చామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ పేర్కొన్నారు

# భారీ వర్షంతో హైదరాబాద్ అతలాకుతలం

హైదరాబాద్, జూన్ 12:

హైదరాబాద్‌లో గురువారం రాత్రి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాత్రి 9.30 గంటల సమయంలో ఆకాశం మబ్బులతో కమ్ముకుని, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కొద్దినిమిషాల పాటు కురిసిన వర్షానికే నగరంలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి.వర్షం కారణంగా ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కీలక కూడళ్లలో వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు వర్షంతో అవస్థలు ఎదుర్కొన్నారు.అమీర్‌పేట్, మైత్రివనం, కూకట్‌పల్లి ప్రాంతాల్లో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. వీకెండ్ కావడంతో సొంత ఊర్లకు వెళ్లేందుకు బయలుదేరిన వారి సంఖ్య అధికంగా ఉండటంతో బస్టాప్‌లు,ప్రధాన కూడళ్లు జనంతో కిక్కిరిశాయి.మరోవైపు భారీ వర్షం కారణంగా



అనేక మంది మెట్రో సేవలను ఆశ్రయించారు. దీంతో మెట్రో స్టేషన్లలో భారీ రద్దీ నెలకొంది. ప్రయాణికులతో స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. నగరంలోని కూకట్‌పల్లి, అమీర్‌పేట్, ఎర్రగడ్డ, మైత్రివనం, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, బేగంపేట, ప్యారడైజ్, పాట్నీ, జేబీఎస్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలు మందగించాయి.

**సీఎం రేవంత్ విమానం మళ్లింపు**

ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కారణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్‌కు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ అనుమతి ఇవ్వకపోవడంతో పైలట్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత విమానం హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు సమాచారం.

# ప్రతిపక్ష ప్రభుత్వాలే బీజేపీ టార్గెట్

మొదటిపేజీ తరువాయి

నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అప్రజాస్వామిక పాలన సాగుతోందని మండిపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ పార్టీ పాలేరు నియోజకవర్గ బూత్ లెవెల్ ఏజెంట్ల(బీఎల్ఏ) శిక్షణ శిబిరం ఏదులాపురంలో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని, బీజేపీ రాజకీయ వ్యూహాలను ఎండగట్టారు.

**ఎస్ఐఆర్ ఒక పెద్ద భూతం**

కేంద్రం చట్టం రూపంలో తీసుకొచ్చిన ఎస్ఐఆర్ ఒక పెద్ద భూతం లాంటిదని, ఇది ముమ్మాటికీ దొంగదారి చర్యేనని మంత్రి విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే బలంగా ఉందో, ఎక్కడైతే మనకు ఓట్లు ఎక్కువగా ఉన్నాయో అక్కడ 30 నుంచి 35 శాతం ఓట్లను ఫేక్ ఓట్లుగా చిత్రీకరించి వాటిని జాబితా నుంచి తొలగించేందుకు కేంద్రం పెద్ద కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఓటరు వయస్సులో స్వల్ప తేడాలున్నా, పేర్లలో స్పెల్లింగ్ మిస్టేక్స్ (రావుకు బదులు రెడ్డి, హుస్సేన్ బదులు శ్రీ అని పడటం) ఉన్నా వాటిని వంకగా చూపి ఓట్లను తొలగించే ప్రమాదం ఉందన్నారు, ఇప్పటికే బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఈ పద్ధతిని ప్రయోగించి బీజేపీ సక్సెస్ అయిందని, అదే ఫార్ములాను ఇప్పుడు తెలంగాణలోనూ ప్రయోగించాలని చూస్తున్నారని హెచ్చరించారు. దీన్ని కాంగ్రెస్ సైనికులు గట్టిగా తిప్పికొట్టాలని మంత్రి పిలుపునిచ్చారు.

నిన్న ఓట్లు.. నేడు ఏకంగా సీట్లే దొంగతనం రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఉదంతాన్ని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఆమెకు అవసరమైన ఓట్ల కంటే 11 ఓట్లు ఎక్కువగా ఉన్నాయని, అయినా కేవలం ఒక పాత ఎఫ్ఐఆర్ కాగితాన్ని సాకుగా చూపి ఎన్నికల అధికారులపై బీజేపీ తీవ్ర ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆమె నామినేషన్‌ను తిరస్కరింపజేసిందని తెలిపారు. ఈ రకంగా కాంగ్రెస్‌కు దక్కాల్సిన రాజ్యసభ స్థానాన్ని వాళ్ళు దొంగిలించారన్నారు. నిన్నటివరకు ఓట్లను దొంగిలించిన బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ఈరోజు ఏకంగా సీట్లనే దొంగిలించే దుస్థితికి దిగజారిందని నిప్పులు చెరిగారు. తన రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిష్ఠాత్మక దర్యాప్తు సంస్థలను బీజేపీ వేట కుక్కల్లా వాడుకుంటోందని మంత్రి తీవ్రంగా ఆరోపించారు. సీబీఐ, ఈడీ, ఇన్‌కమ్ టాక్స్ సంస్థలను అడ్డం పెట్టుకుని ఇతర పార్టీల ప్రజాప్రతినిధులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. ఆయా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు పన్నుతున్నదని, దేశంలో ఎక్కడ బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నా ఇదే రకమైన కుట్రలు సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి ఓటూ కాంక్రీట్ గోడ కావాలి

ఈనెల 25 నుంచి జూలై 24 వరకు నెల రోజులపాటు నిర్వహించే ఓట్ మ్యాపింగ్ ప్రక్రియపై కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఆదేశించారు. ఉద్యోగాలు, చదువుల రీత్యా ఖమ్మం, హైదరాబాద్‌లలో ఉండే మన వాళ్లు అధికారులు వచ్చినప్పుడు ఊర్లో లేరనే సాకుతో ఓట్లు తొలగించే ప్రమాదం ఉందన్నారు. అధికారులు వచ్చే ముందే గ్రామంలో చాటింపు వేయించి వేరే ఊర్లలో ఉన్న మన ఓటర్లను రప్పించి ఓటు కాపాడుకోవాలని సూచించారు. మనకు దొంగ ఓట్లు అవసరం లేదు.. మనకున్న జనాదరణతో ప్రతి ఓటునూ ఒక కాంక్రీట్ గోడలాగా కాపాడుకోవాలి అని స్పష్టం చేశారు. దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మన నేత రాహుల్ గాంధీకి కార్యకర్తలు సైనికుల్లా అండగా నిలబడాలని, ఎసఐఆర్ కుట్రలను ప్రజల్లోకి తీసుకెళ్లి సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్, పీసీసీ ప్రతినిధి సుధాకర్, ఖమ్మం టౌన్ ప్రెసిడెంట్, ఏదులాపురం మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, 291 బూత్‌ల బిఎల్ఏలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు

హైదరాబాద్, జూన్ 12 :

సింగరేణి కార్మికులకు ప్రభుత్వం శుభవార్త తెలిపింది. వివిధ కారణాలతో నిలిచిపోయిన మెడికల్ బోర్డును అతి త్వరలో ప్రారంభించాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. సింగరేణి అభివృద్ధిపై ఇటీవల కోల్ బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు, మంత్రులతో నిర్వహించిన సమావేశంలో మెడికల్ బోర్డు అంశాన్ని వారు తన దృష్టికి తీసుకొచ్చారని, ఈ అంశంపై కార్మికుల ఆందోళనలను వివరించారని చెప్పారు. ఆ సమావేశంలో వ్యక్తమైన అభిప్రాయాలను ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి కార్మికుల ప్రయోజనాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందన్నారు. మెడికల్ బోర్డు ద్వారా అర్హులైన ఉద్యోగులకే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారి వారసులకు కారుణ్య నియామకాల రూపంలో ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలు, అవకతవకలు, మధ్యవర్తిత్వం లేదా మోసాలకు తావులేకుండా కట్టుదిట్టమైన వ్యవస్థను అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమం విషయంలో ప్రజా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తోందంటూ మెడికల్ బోర్డు ప్రక్రియపై పూర్తి విశ్వాసం ఉంచి యాజమాన్యానికి సహకరించాలని కార్మికులకు సూచించారు. ఇటీవలి వరకు కారుణ్య నియామకాలు, డిపెండెంట్ ఉద్యోగాలకు అర్హత సాధించిన 335మంది వారసులకు మంచిర్యాలలో శనివారం(13న) జరిగే కార్యక్రమంలో ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిరు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న మారుపేర్ల అంశం తమ దృష్టిలో ఉందన్నారు. దీన్ని పరిష్కరించేందుకు ఉన్న మార్గాలను అన్వేషిస్తున్నట్లు, న్యాయపరమైన సలహా తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

**ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ సింగరేణి**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క వివరించారు. సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేశామన్నారు. వీటిలో 555 ఎక్స్టర్నల్ పోస్టులు ఉండగా 2,102 కారుణ్య నియామక ఉద్యోగాలు ఇచ్చామన్నారు. ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీని కూడా ఆన్‌లైన్ పద్ధతిలో చేపట్టి వివాదరహితంగా అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల కోసం ఉన్న గరిష్ఠ వయోపరిమితిని 35 నుండి 40 సంవత్సరాలకు పెంచడం ద్వారా మరింతమంది అర్హులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఇప్పటికే 200మంది లబ్ధి పొందారని వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా సింగరేణిలో పనిచేస్తున్న 40 వేల మంది ఉద్యోగులకు భరోసా కల్పించేలా రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామని తెలిపారు. ఇదేకాక బ్యాంకులతో సంప్రదింపులు జరిపి ఇటీవలే ఉద్యోగులకు రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాన్ని కూడా కల్పించామన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.40 లక్షల ప్రమాద బీమా సదుపాయాన్ని కల్పించామన్నారు. గత రెండేళ్లలో రూ.1500 కోట్లను లాభాల వాటా రూపేణా చెల్లించినట్లు వెల్లడించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు కూడా బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. ప్రతీ ఉద్యోగికి అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో అన్ని ఏరియా హాస్పిటల్స్ ఆధునికీకరణకు చర్యలు తీసుకోవడమేకాక గోదావరిఖనిలో క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఉద్యోగులు, వారి తల్లిదండ్రులు, డిపెండెంట్ పిల్లల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా వెచ్చిస్తున్నట్లు చెప్పారు. తన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర సందర్భంగా సింగరేణి కార్మికుల కష్టాలు, సమస్యలను ప్రత్యక్షంగా చూసినట్లు గుర్తు చేసుకున్నారు. అందువల్ల సింగరేణి కార్మికులతో తనకు ప్రత్యేకమైన అనుబంధం ఉందని, వారి సంక్షేమం, ఉద్యోగ భద్రత, వారి కుటుంబాల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా సింగరేణి బహుముఖంగా విస్తరించేందుకు, కొత్త బొగ్గు బ్లాకులు సాధించేందుకు, తద్వారా ఉద్యోగుల వారసులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతాయన్నారు. ఒడిశా నైనీ బ్లాక్ అనుమతులతోపాటు బొగ్గు ఉత్పత్తికి తీసుకున్న ప్రత్యేక చొరవను గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాల్లోనూ సంస్థను విస్తరించే దిశగా ప్రయత్నిస్తున్నామన్నారు.

# ప్రపంచ వేదికపై భారత్

హైదరాబాద్, జూన్ 12:

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో గత 12 ఏళ్లలో ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ట గణనీయంగా పెరిగిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన దేశ అభివృద్ధి, భద్రత, అంతర్జాతీయ స్థాయిలో భారత్ సాధించిన విజయాలపై మాట్లాడారు. ఒకప్పుడు అంతర్జాతీయ సమాజంలో భారతదేశం చెప్పే మాటకు పెద్దగా ప్రాధాన్యం ఉండేది కాదని, ప్రస్తుతం ప్రపంచ వేదికలపై భారత్ ఏది చెప్పినా యావత్ ప్రపంచం శ్రద్ధగా వింటోందని రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రజల ఆశీస్సులు, అభిమానాన్ని అత్యధికంగా పొందిన పార్టీ భారతీయ జనతా పార్టీ అని అన్నారు. దేశంలో ఏ రోగానికి ఏ మందు కావాలన్నా అందుబాటులో ఉందని, దేశ ప్రజల ఆరోగ్య భద్రత కోసం అవసరమైన వ్యాక్సిన్లు ఉన్నాయని చెప్పారు. అదే సమయంలో దేశ రక్షణ కోసం అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణులు కూడా సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వ్యాక్సిన్ కూడా ఉంది, బ్రహ్మోస్ కూడా ఉందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణ రెండింతలు పెరిగిందని, రైల్వే రంగ అభివృద్ధి కోసం రూ.5,500 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు వెల్లడించారు. ఇటీవలే ప్రధానమంత్రి మోడీ పీఎం మిత్రా పార్క్‌ను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. దేశంలో నక్సలిజాన్ని నిర్మూలించే దిశగా కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా ముందుకు సాగిందని ఆయన అన్నారు. అలాగే ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో శాంతి, అభివృద్ధి కొత్త దశలోకి ప్రవేశించాయని పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని లాల్‌చౌక్‌లో జాతీయ జెండా రెపరెపలాడుతోందని, పరిశ్రమలు పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. కాశ్మీర్‌లో కృష్ణాష్టమి వంటి పండుగలు కూడా ఘనంగా నిర్వహించబడుతున్నాయని చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు విదేశీ సంస్థలు వెనుకంజ వేసేవని, ప్రస్తుతం అనేక దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునేందుకు ముందుకు వస్తున్నాయని రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. దేశ ఆర్థిక, పారిశ్రామిక, రక్షణ రంగాల్లో సాధిస్తున్న పురోగతి ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తోందని పేర్కొన్నారు. భారతదేశం మరింత శక్తివంతమైన దేశంగా ఎదిగే దిశగా మోడీ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన అన్నారు.

## వ్యవసాయానికి విలువ పెంచాలి.. రైతు ఆదాయం పెరగాలి

హైదరాబాద్, జూన్ 12:

వ్యవసాయ విశ్వవిద్యాలయం కేవలం పంట ఉత్పత్తి పెంపుపైనే కాకుండా పంటలకు విలువ పెంచడం, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులపై కూడా దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతుల ఆదాయం పెరగాలంటే విలువ ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవసాయం వైపు అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు.జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి తుమ్మల మాట్లాడారు. ఆరు దశాబ్దాలుగా వ్యవసాయ పరిశోధనలు, విద్య, విస్తరణ సేవల ద్వారా రైతులకు విశ్వవిద్యాలయం అండగా నిలుస్తోందని ప్రశంసించారు.వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇప్పటివరకు 525 పంట రకాలను అభివృద్ధి చేసిందని తెలిపారు. తెలంగాణ సోనా, బీపీటీ5204, ఎంటీయూ 1010 వరి రకాలు, డీహెచ్ఎం శ్రేణి మొక్కజొన్న సంకర రకాలు దేశవ్యాప్తంగా రైతుల ఆదరణ పొందాయని చెప్పారు. వేలాది మంది వ్యవసాయ పట్టభద్రులు, పరిశోధకులను తయారు చేసి వ్యవసాయ రంగానికి విశేష సేవలు అందించిందన్నారు.రైతు నేస్తం, డ్రోన్ అకాడమీ, అగ్రి హబ్, డిజిటల్ వ్యవసాయం, కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలతో విశ్వవిద్యాలయం భవిష్యత్ వ్యవసాయానికి కేంద్రబిందువుగా మారుతోందని పేర్కొన్నారు. ప్రపంచ వ్యవసాయం ప్రస్తుతం కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, డ్రోన్లు, ఖచ్చితత్వ వ్యవసాయం వైపు వేగంగా పయనిస్తోందని, తెలంగాణ కూడా అదే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు.




# బడిలోనే దేశ భవిష్యత్‌కు పునాది!

విద్యావైద్యమే పేదరిక నిర్మూలనకు సామాజిక పురోభివృద్ధికి దోహదపడతాయని సిఎం రేవంత్ రెడ్డి నీతి ఆయోగ్‌లో చెప్పిన మాటలు అక్షర సత్యాలు. కులరహిత సమాజానికి ఇది దోహదపడుతుందని కూడా అభిప్రాయపడ్డారు. అయితే ఇది ఎంతవరకు ఆచరణ చేస్తున్నారో ఆత్మపరిశీలన చేసుకునే సమయం వచ్చింది. స్కూళ్లు తెరవబోతున్నారు. గత రెండున్నరేళ్లుగా స్కూళ్లను ఏ మేరకు అభివృద్ది చేశారో చెప్పాలి. వసతి గృహాలు మృత్యుకుహరాలుగా మారాయి. యంగ్ ఇండియా స్కూళ్లు అంటూ ఊదర గొట్టడం కాకుండా ఉన్న స్కూళ్లను బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకోవాలి. ఒకవేళ యంగ్ ఇండియా స్కూళ్లు కావాలనుకుంటే..వాటితో పాటు ఉన్న స్కూళ్లను బలోపతేం చేయాలి. స్కూళ్లను హాస్టళ్లను అనుసంధానించడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీనిగురించి పట్టించుకోవడం లేదు. పాఠశాలల తో వసతిగృహాలను అనుసంధానించి, సకల సౌకర్యాలు కలిగిస్తే...సిఎం రేవంత్ కోరుకున్న కులరహిత విద్యావిధానం సాధ్యమవుతుంది. అందుకు పెద్దగా పెట్టుబడులు అవసరం లేదు. ఇప్పుడు ఖర్చు చేస్తున్న బడ్జెట్‌లోనే కలెక్టర్లకు ఈ పని అప్పగించి పర్యవేక్షిస్తే సత్వర విజయం సాధించవచ్చు. ఎందుకంటే... స్వేచ్ఛా వాతావరణంలో ఆడుతూ.. పాడుతూ గడపాల్సిన బాలలు పనిలో బందీ అవుతున్నారు. అక్షరాలు దిద్దాల్సిన సమయంలో పత్తి చేలలో పనిచేస్తున్నారు. పుస్తకాల సంచీతో బడికి వెళ్లాల్సిన వారు హోటళ్లు, మెకానిక్ షెడ్లలో కార్మికులుగా మారుతున్నారు.. అక్షరాలు దిద్దాల్సిన చేతులతో బట్టీల్లో ఇటుకలను మోస్తున్నారు. అందుకు తల్లిదండ్రుల పేదరికమే ప్రధాన కారణం. చదువు ప్రాధాన్యంపై వారికి అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత ఇతర కారణాలని చెప్పవచ్చు. పేదరికం బాలల పాలిట శాపంగా మారకుండా ప్రతి ఒక్కరిని బడిలో చేర్పించే బాధ్యత గ్రామాలకు అప్పగించాలి. సర్పంచ్‌లను ఇందుకు బాధ్యులను చేయాలి. ఆర్థిక స్థోమత లేక,కుటుంబ పోషణ భారమై తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి బదులు పనులకు పంపిస్తున్నారు. కొందరు గొర్రెలు, పశువుల కాపరులుగా మారుతున్నారు. మరికొందరు బాలలు యాచకులుగా వీధుల్లో కనిపించడం ఆవేదన కలిగిస్తోంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు ఎన్ని కార్యక్రమాలు నిర్వహిస్తున్నా పూర్తిస్థాయి ఫలితాలు సాధ్యం కావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో ఇటుక బట్టిల్లో బాలలు కూలీలుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాల రిజిస్టర్‌లో పేర్లు ఉన్నా.. బాలలు మాత్రం పత్తిచేలల్లో, ఇటుకల బట్టీల్లో పని చేస్తుంటారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో ఇలా వందలాది మంది బాల కార్మికులను గుర్తించారు. ఈ క్రమంలో మళ్లీ స్కూళ్లు తెవరబోతున్న క్రమంలో పిల్లల సంఖ్య పెంచాలని విద్యాశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఒక ప్రణాళిక లేకపోవడం వల్ల వారు పాఠశాల వరకు రాలేకపోతున్నారు. పిల్లలకు ఉచితంగా భోజనం కల్పిస్తున్నా ఆకర్షించలేకపోతున్నారు. ఇందుకోసం గ్రామస్థాయిలో సర్వే చేయిలి. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలి. ఎందుకంటే దేశ భవిష్యత్ పాఠశాల నుంచే మొదలవుతుంది. ఆరోగ్యకరమైన సమాజం కావాలంటే చదువు కావాలన్న సంకల్పాన్ని నెరవేర్చడం అవసరం. ఇందుకోసం ప్రణాళిక అవసరం. వసతి గృహాల్లో వసతులు లేవు. అలాంటి వాటిని నడిపే బదులు గ్రామాల్లోనే తల్లిదండ్రుల వద్ద పిల్లలను అప్పగించి, స్కూళ్లకు పంపడం నేర్పించాలి. స్కూళ్లో పెన్సిల్ మొదలు, పుస్తకాలు బట్టలు, ఫీజులు ఉచితం చేయాలి. కులమతాలకు అతీతంగా చేసి మంచి భోజన వసతులు స్కూళ్లలోనే కల్పించాలి. అప్పుడు పిల్లలు ఇంటినుంచే స్కూళ్లకు వచ్చేందుకు ఇష్టపడతారు. తల్లిదండ్రులు కూడా ఇందుకు ఒప్పుకుంటారు. ఇది పెద్దగా బడ్జెట్‌తో కూడుకున్న పనికాదు. ఇప్పుడు హాస్టళ్లకు పెడుతున్న ఖర్చుతో దీనిని నెరవేర్చవచ్చు. ఇలా చేస్తే వారే రేపటి పౌరులుగా తయారవుతారు. మనం నేర్పిన నడవడిక, మనం తీర్చిదిద్దిన అక్షరాలు వారి జీవిత గమ్యానికి బాటలు వేస్తాయి. పిల్లలు ఎలా ఎదిగాలి, ఫలితాలు రాబట్టేలా ఉపాధ్యాయులకు బాధ్యతలు అప్పగించాలి. సమాజాభివృద్ధికి ఉపయోగపడే వ్యక్తిత్వ వికాసాన్ని పిల్లలు పుణికి పుచ్చుకునేలా బడిలోనే పునాది వేయాల్సి ఉంటుంది. గత అనుభవాలను మననం చేసుకుంటూ ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ బడి పట్ల సమాజానికి నమ్మకం కలిగేటట్లు కార్యాచరణ సిద్ధం చేస్తే మంచిది. ఇందుకు తల్లిదదండ్రులను, గ్రామంలో పెద్దలను పలకరిస్తే బోలెడు సమాచారం చెబుతారు. ప్రభుత్వ బడి బాగా నడుస్తుందంటే మన సమాజం బాగుపడ్డట్లుగానే భావించాలి. ఎందుకంటే ఇప్పటికీ ఇంకా ప్రభుత్వ బడి పట్ల నమ్మకం కలిగిన తల్లిదండ్రులు ఈ సమాజంలో ఉన్నారు. వాళ్ళ నమ్మకాన్ని వమ్ము చేయకుండా విద్యార్థులకు నాలుగు అక్షరాలు, నైతిక విలువలు నేర్పే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాల్సిందే. ఆటంకాలు ఎన్నొచ్చినా ప్రభుత్వం బోధనేతర కార్యక్రమాల చుట్టూ ఉపాధ్యాయులను తిప్పినా.. పిల్లలకు తగు న్యాయం చేయటం కూడా ఉపాధ్యాయుల బాధ్యత. అలాగే పిల్లలకు బోధన చేసే ఉపాధ్యాయులకు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ఒత్తిడి లేకుండా ఉపాధ్యాయులు బడిలో పిల్లలకు బోధన మాత్రమే చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. పాస్ టార్గెట్లు పెట్టడం వల్ల పిల్లలలో సృజనాత్మకత దెబ్బ తింటుంది. బట్టీయ పద్ధతి వల్ల సృజనాత్మకంగా ఆలోచించటం మరచి భవిష్యత్తు అంతా ఎదుటి వాళ్ళ మీద ఆధారపడటం తప్ప తనంతట తను బతకడం అలవాటు లేని పరిస్థితులలోకి నెట్టివేయ బడతారు. ఇవన్నీ అధిగమించాలంటే ప్రభుత్వ సంకల్పమే ముఖ్యం. నీతి ఆయోగ్ సమావేశంలో చెప్పిన అంశాలను ఆచరణలో పెట్టాలి. అందుకు అనుగుణంగా ముందు రాష్ట్రంలోని పాఠశాలల పరిస్థితులను తెలుసుకుని వాటిని బాగు చేయాలి. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపగలిగేలా పరిస్థితుల్లో మార్పు తీసుకుని రావాలి. అలాగే ప్రైవేట్ స్కూళ్ల ఫీజు దోపిడీని కూడా అరికట్టాలి. లక్షల్లో ఫీజులు కట్టడం కోసం తల్లిదండ్రులు నానా యాతన పడుతున్నారు. ఇది తప్పాలంటే ప్రభుత్వ బడులు బలోపేతం కావాలి. అందుకు సంకల్పం ఉంటే మార్పు సాధ్యమే.

# ఒక్కో వాహనానికి 200 లీటర్లకు మించి అమ్మరాదు

- ముడిచమురు సరఫరాలో అంతరాయం
- పెట్రోల్ బంకులపై ఆంక్షలు విధించిన కేంద్రం




**న్యూఢిల్లీ, జూన్ 12:** పశ్చిమాసియా పరిణామాలతో ముడిచమురు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్ బంకుల నుంచి భారీ మొత్తంలో పెట్రోల్, డీజిల్ కొనుగోలుపై నిషేధం విధించింది. ఈ ఆంక్షలు 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. ఒక వాహనానికి రోజుకు 200 లీటర్ల కంటే ఎక్కువ డీజిల్‌ను నింపవద్దని రిటైల్ అవుట్‌లెట్ల యాజమాన్యాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా బల్క్ ఇంధన ధరలు, రిటైల్ ధరల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ముఖ్యంగా డీజిల్ ధర పెట్రోల్ బంకుల్లో లీటర్‌కు రూ.95.20గా ఉండగా.. బల్క్ ధర రూ.134.50 పలుకుతోంది. దీంతో ఇటీవల కొన్ని పరిశ్రమ వర్గాలకు చెందిన, వాణిజ్య వినియోగదారులు బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచి కాకుండా పెట్రోల్ బంకుల నుంచి ఎక్కువ మొత్తంలో ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలు అసాధారణ స్థాయిలో పెరిగినట్లు అధికారులు గుర్తించారు. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో రిటైల్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని అరికట్టేందుకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా ఆదేశాలిచ్చింది. పరిశ్రమ, వాణిజ్య అవసరాల కోసం వినియోగదారులు రిటైల్ పెట్రోల్ బంకుల్లో ఇంధనం కొనుగోలు చేయకుండా నిషేధం విధించింది. బల్క్ సప్లయ్ చైన్‌ల నుంచే వారు పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. అంతేగాక, పెట్రోల్ బంకుల వద్ద ఒక వాహనానికి లేదా ఒక కస్టమర్‌కు రోజుకు 200 లీటర్లకు మించి డీజిల్‌ను విక్రయించొద్దని ఆదేశించింది. ఈ డీజిల్‌ను పునర్‌విక్రయించకూడదని సూచించింది. ఈ ఆదేశాలు తొలుత 90 రోజుల వరకు అమల్లో ఉంటాయని, అవసరమైతే పరిస్థితిని బట్టి పొడిగిస్తామని పెట్రోలియం మంత్రిత్వశాఖ తమ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

# హనీట్రాప్‌లో మోసపోయిన మహిళా న్యాయమూర్తి

## పనివాళ్లతో ఫిర్యాదుతో బయటపడ్డ వైనం



**చండీఘడ్, జూన్ 12:** హనీట్రాప్‌లో పడి.. ఓ మహిళా న్యాయమూర్తి రూ.లక్షలు పోగొట్టుకున్నారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా ఫిర్యాదు చేయకుండా.. తన ఇంట్లో పనిచేసే వాళ్లతో ఫిర్యాదు చేయించడం చర్చనీయాంశమైంది. హరియాణాకు చెందిన ఓ మహిళా న్యాయమూర్తికి గతేడాది నవంబరులో టిండర్ యాప్ ద్వారా అభిమన్యు వశిష్ఠ్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. కొద్దికాలంలోనే వీరి మధ్య బంధం బలపడింది. కొంతకాలం తర్వాత పెట్టుబడి పెడితే అధిక రాబడులు వస్తాయని మహిళా న్యాయమూర్తిని నమ్మించిన అభిమన్యు ఆమెతో పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టించాడు. ఈమేరకు అతడికి సంబంధించిన ఖాతాలకు ఆమె రూ.52 లక్షలకు పైగా నగదు బదిలీ చేశారు. ఎన్నాళ్లయినా లాభాలు రాకపోవడంతో.. ఇదంతా మోసమని గ్రహించారు. అయితే, దీనిపై ఆమె స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. తన ఇంట్లో పనిచేసే సహాయకురాలి పేరు మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు. దీనిపై దర్యాప్తు చేసిన అధికారులు నిందితుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కింది కోర్టు బెయిల్ నిరాకరించడంతో.. అభిమన్యు సెషన్స్ కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసు విచారణ సందర్భంగా లావాదేవీలు సహాయకురాలి బ్యాంకు నుంచి కాకుండా.. న్యాయమూర్తి ఖాతాల నుంచి జరిగాయని అదనపు సెషన్స్ జడ్జి సౌరభ్ ప్రతాప్ సింగ్ గుర్తించారు. అలాగే దర్యాప్తులో కూడా లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. నిందితుడు, న్యాయమూర్తికి సంబంధించిన పూర్తి వాట్సప్ సంభాషణలను, కాల్ రికార్డులు సేకరించలేదని తెలిపారు. దర్యాప్తు అసంపూర్తిగా ఉన్నందున.. కీలకమైన సాక్ష్యాలు ఇంకా సేకరించాల్సి ఉందని పేర్కొంటూ నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించారు. టిండర్ యాప్, వాట్సప్‌లలో ఇరువురి మధ్య జరిగిన పూర్తి సంభాషణలను సేకరించాలని ఈ సందర్భంగా దర్యాప్తు అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. నిధుల బదిలీకి వివరాలు.. నిందితుడి ఫోన్‌కి సంబంధించిన ఫోరెన్సిక్ విశ్లేషణను తొందరగా నిర్వహించాలని పేర్కొంది.

# ఆర్ఎస్ఎస్ చీఫ్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్లు

## ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



**న్యూఢిల్లీ, జూన్ 12:** రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రయాణిస్తున్న రైలుపై రాళ్ల దాడి జరిగింది. ఈ దాడికి సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం రాత్రి మోహన్ భాగవత్ కాన్పూర్ నుంచి దిల్లీకి వెళ్తున్న శతాబ్ది ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ రైల్వేస్టేషన్ సమీపంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఈ రైలుపై రాళ్లు విసిరారు. దీంతో ఏసీ ఫస్ట్ క్లాస్ కోచ్‌లోని ఓ కిటికీ దెబ్బతింది. భాగవత్ కూడా ఇదే కోచ్‌లో ఉన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ ఘటనలో ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు ధ్రువీకరించారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలోనే సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా ముగ్గురు వ్యక్తులు కావాలనే రాళ్ల దాడికి పాల్పడినట్లు యూపీ పోలీసులు గుర్తించారు. ఆ ముగ్గురిలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు తాజాగా పేర్కొన్నారు. మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

# పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలు

- రష్యాతో చమురు కొనుగోళ్లను సమర్థించిన జైశంకర్
- అమెరికా సుంకాల విధింపులో నైతికత లేదన్న మంత్రి



**న్యూఢిల్లీ,జూన్12:** పాశ్చాత్య దేశాల ద్వంద్వ ప్రమాణాలపై భారత విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ తాజాగా విమర్శలు గుప్పించారు. రష్యా చమురును కొనుగోలు చేయమని 2022లో అమెరికా భారత్‌ను అభ్యర్థించిందని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల స్థిరీకరణ దిశగా రష్యా చమురు కొనుగోలు చేయాలని యూఎస్ చెప్పిందని అన్నారు. ఫిన్‌లాండ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా తమకు స్థిరమైన సరఫరాదారుగా ఉందని కూడా మంత్రి జైశంకర్ తెలిపారు. యూఎస్ మాత్రం పరస్పర విరుద్ధ విధానాలను అవలంబించిందని అన్నారు. యూఎస్ నిర్ణయాలకు నైతిక ప్రాముఖ్యాన్ని ఆపాదించాల్సిన అవసరం లేదని కూడా అభిప్రాయపడ్డారు. అప్పట్లో అమెరికా భారత్‌ను ప్రత్యేకంగా అభ్యర్థించింది. చమురు మార్కెట్ స్థిరత్వం కోసం రష్యా చమురును కొనుగోలు చేయాలని చెప్పింది. ముడి చమురు ధరల లభ్యత, ధరల ఆధారంగా మేము కొనుగోళ్లు చేస్తాము' అని మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. రష్యా విషయంలో భారత్ మరీ ఉదారంగా వ్యవహరిస్తూ ముడి చమురు కొనుగోలు చేస్తోందన్న ఒక విలేకరి ఆరోపణపై మంత్రి ఈ మేరకు స్పందించారు. ఆ సమయంలో మార్కెట్‌లో ముడి చమురులో అధిక భాగం రష్యాకు చెందినదేనని అన్నారు. భారత్‌కు ఎంతోకాలంగా ముడి చమురును సరఫరా చేస్తున్న పశ్చిమాసియా దేశాల క్రూడాయిల్ ను ఐరోపా దేశాలు ఎక్కువగా కొనుగోలు చేసేవని చెప్పారు. ఆ పరిస్థితుల్లో తాము తమ దిశను మార్చుకోవాల్సి వచ్చిందని వివరించారు. రష్యా చమురును కొనుగోలు చేస్తున్నామని మొదట సుంకాలు విధించారు. ఆ తరువాత మళ్లీ వాటిని సడలించారు. కాబట్టి, ఇక్కడ ఏదో గొప్ప సైద్ధాంతిక ప్రాతిపదిక ఉన్నట్టు భావించకూడదు. ఇది నైతికతకు సంబంధించిన అంశంగా పరిగణించడం అనవసరం అని మంత్రి జైశంకర్ తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా రష్యా విషయంలో భారత్ అనుసరిస్తోన్న విధానంపై ఐరోపా దేశాలు చేస్తోన్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. రష్యా చమురు కొంటున్నందుకు తమను ప్రశ్నిస్తోన్న ఆ దేశాలు విక్రయించిన ఆయుధాలతో ప్రత్యర్థులు భారత్‌పై దాడులకు ఉపయోగించిన విషయాన్ని గుర్తుచేశారు. ఈసందర్భంగా భారత్ దేశ ఇంధన ఎంపికలను ఆయన సమర్థించారు. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లను స్థిరీకరించేందుకు అమెరికానే రష్యా చమురు కొనుగోలు చేయమని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి రష్యాతో భారత్ మరీ సానుకూలంగా వ్యవహరిస్తోందని, ఆ దేశ చమురుపై అతిగా ఆధారపడుతోందని ఈ చర్చలో మంత్రికి ప్రశ్న ఎదురైంది. దానికి మంత్రి సూటిగా బదులిచ్చారు. భారతదేశ ప్రత్యర్థులకు ఐరోపా దేశాలు ఆయుధాలు అమ్మిన విషయాన్ని గుర్తుచేసి, స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. భారత్ తయారుచేసిన ఆయుధాలతో ఏ ఐరోపా దేశం పైనా దాడి జరగలేదు. ఐరోపా ఆయుధాల విషయంలో కూడా నేను అలా చెప్పగలిగితే బాగుండేది. ఐరోపా ఆయుధాలు అమ్మింది. వాటిని భారత్‌పై దాడి చేయడానికి ఉపయోగించారు. ఇప్పుడే కాదు.. కొన్నేళ్లుగా అలా జరుగుతోంది. ఐరోపాను ప్రమాదంలో పడేసే పని ఏదీ భారతీయులు చేయలేదని పేర్కొన్నారు. అలాగే రష్యా చమురు విషయంలో భారత విధానంపై మరోసారి స్పష్టత ఇచ్చారు. ఇక్కడ నేను రెండు విషయాలు గమనించాను. మేం ధర, లభ్యత ఆధారంగా చమురు కొనుగోలు చేస్తాం. ఆవిధంగా చూసుకుంటే.. అప్పుడు మార్కెట్లో లభించే చమురులో అధికభాగం రష్యాకు చెందినదే. మరోవైపు మాకు ఎప్పటినుంచో చమురు సరఫరా చేసే పశ్చిమాసియా నుంచి అప్పుడు ఐరోపా చమురు కొనుగోలు చేసింది. ఈ పరిణామాల ఆధారంగానే మేం నిర్ణయాలు తీసుకున్నాం అని మంత్రి జైశంకర్ వెల్లడించారు. ఆంక్షలు, వాణిజ్యం, ఇంధన భద్రత విషయంలో పశ్చిమదేశాల విధానాలలో ఉన్న వైరుధ్యాలను ప్రశ్నించారు. పక్షపాత ధోరణితో వ్యవహరించడాన్ని ఆయన తప్పుపట్టారు. జాతీయ ప్రయోజనాలు, ఇంధన భద్రత, ఆర్థిక అంశాల ఆధారంగానే భారత ప్రభుత్వం తీసుకొనే నిర్ణయాలు ఉంటాయని స్పష్టంచేశారు.

చురకలు



# ఓట్ల తొలగింపునకు కేంద్రం కుట్ర: మంత్రి పొంగులేటి ఆరోపణ

**ఖమ్మం జూన్12:**



ఏదులాపురం మున్సిపాలిటీ: కాంగ్రెస్ బలంగా ఉన్న ప్రాంతాల్లో ఓట్ల తొలగింపునకు కేంద్రం కుట్ర చేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్ల శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. ఎస్ఐఆర్ పేరిట 30 నుంచి 35 శాతం ఓట్లను ఫేక్ ఓట్లుగా చూపించి తొలగించే ప్రయత్నం జరుగుతోందన్నారు. బీహార్, బెంగాల్‌లో అమలు చేసిన విధానాన్ని తెలంగాణలోనూ ప్రయోగించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై ఒత్తిడి కోసం వాడుతున్నారని పొంగులేటి ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే ఓట్ మ్యాపింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా బూత్ స్థాయిలో కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, 291 బూత్‌ల బీఎల్‌ఏలు పాల్గొన్నారు.

# లాజిస్టిక్స్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

**హైదరాబాద్, జూన్ 12:**




తెలంగాణను గ్లోబల్ లాజిస్టిక్స్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం హెచ్ఐసీసీ నోవాటెల్‌లో ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ 2026'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'లాజిస్టిక్స్ పాలసీ 2.0' ద్వారా మెగా మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, డ్రై పోర్టులు, బాండెడ్ వేర్‌హౌజింగ్, లాజిస్టిక్ పార్కుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి తెలిపారు. సముద్ర తీరం లేకపోవడాన్ని పరిమితిగా కాకుండా డిజైన్ అడ్వాంటేజ్‌గా మార్చుకుంటున్నామని చెప్పారు. ఎగుమతుల సన్నద్ధత సూచీలో తెలంగాణ దేశంలో ఎనిమిదో స్థానం, సముద్రతీరం లేని రాష్ట్రాల్లో రెండో స్థానం సాధించిందని పేర్కొన్నారు. మర్చండైజ్ ఎగుమతుల్లో ఏడో స్థానంలో నిలవడం రాష్ట్ర పారిశ్రామిక వృద్ధికి నిదర్శనమన్నారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను లాజిస్టిక్స్ రంగంలో వినియోగించేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మల్టీ మోడల్ లాజిస్టిక్స్, ఎయిర్ కార్గో, కోల్డ్ చైన్, గ్రీన్ మొబిలిటీ రంగాల్లో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని మంత్రి పిలుపునిచ్చారు.

# త్వరలో సింగరేణి మెడికల్ బోర్డు ప్రారంభం

**పారదర్శకంగా నిర్వహించాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, జూన్ 12:**

సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొంతకాలంగా నిలిచిపోయిన మెడికల్ బోర్డును త్వరలో యథావిధిగా ప్రారంభించాలని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. మెడికల్ బోర్డు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిష్పాక్షికంగా, వివాదరహితంగా నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. నిజంగా అర్హులైన ఉద్యోగులకు మాత్రమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుని, వారి వారసులకు కారుణ్య నియామకాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శనివారం మంచిర్యాలలో జరిగే కార్యక్రమంలో 335 మంది వారసులకు కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించారు. సింగరేణిలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్ల సమస్య కూడా ప్రభుత్వ దృష్టిలో ఉందని, దీనిపై న్యాయ సలహా తీసుకుని నిబంధనల ప్రకారం సానుకూల చర్యలు చేపడతామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో 2,657 పోస్టులను భర్తీ చేసినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. వీటిలో 555 ప్రత్యక్ష నియామకాలు, 2,102 కారుణ్య నియామకాలు ఉన్నాయని చెప్పారు. కారుణ్య నియామకాల గరిష్ఠ వయోపరిమితిని 35 నుంచి 40 ఏళ్లకు పెంచడంతో ఇప్పటికే 200 మంది లబ్ధి పొందారని పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగుల కోసం రూ.1.25 కోట్ల ప్రమాద బీమా, రూ.10 లక్షల ఉచిత సహజ బీమా సదుపాయాలు కల్పించామని, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నామని తెలిపారు. గత రెండేళ్లలో కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటా చెల్లించామని పేర్కొన్నారు. సింగరేణి ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు గోదావరిఖనిలో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటు చేశామని, ఉద్యోగులు, వారి కుటుంబాల వైద్య సేవల కోసం ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సింగరేణిని బహుముఖంగా విస్తరించి, కొత్త బొగ్గు బ్లాకులు సాధించడం ద్వారా భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని భట్టి విక్రమార్క తెలిపారు.

# ఏ సి బి వలలో నర్సింహులపేట ఎంపీడీవో, ఎంపీఓ

**నర్సింహుల పేట జూన్12 :**



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలానికి చెందిన ఎంపీడీవో పెనుగొండ రాధిక, ఎంపీఓ కె. యాకయ్య, అలాగే ప్రైవేట్ వ్యక్తి సి. నాగార్జునను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఫిర్యాదుదారుడి భూమికి సంబంధించిన లేఅవుట్ అభివృద్ధి ప్రక్రియలో గ్రామ పంచాయతీకి భద్రతా హామీగా భూమిని తనఖా పెట్టేందుకు అవసరమైన సూచనలు జారీ చేయడానికి ఎంపీడీవో రూ.20 వేల, ఎంపీఓ రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ తెలిపింది. ఎంపీడీవో తన కుమారుడు, వ్యక్తిగత సహాయకుడు, డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగార్జున ద్వారా లంచం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యవహారంలో గతంలోనూ ఎంపీడీవో రూ.30 వేల, ఎంపీఓ రూ.25 వేల లంచం తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. నిందితుల వద్ద నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురినీ అరెస్టు చేసి వరంగల్‌లోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై క్యాబినెట్ సబ్ కమిటీ చర్చ

**హైదరాబాద్: జూన్12:.**

వనరుల సమీకరణ కోసం ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఛాంబర్‌లో ప్రారంభమైంది. ఈ సమావేశంలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై చర్చ జరిగే అవకాశం ఉంది. సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి కూడా హాజరయ్యారు. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం నేటి ఎజెండాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై సబ్ కమిటీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై జర్నలిస్టు వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# సీఐడీ ప్రధాన కార్యాలయంలో స్మార్ట్ ట్రైనింగ్ కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్ ప్రారంభం

**హైదరాబాద్, జూన్ 12:**



తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ శుక్రవారం లక్డీకాపూల్‌లోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో స్మార్ట్ ట్రైనింగ్ కంప్యూటర్ ల్యాబ్, షీ సైబర్ ల్యాబ్, మినీ కాన్ఫరెన్స్ హాల్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐడీ డీజీ చారు సిన్హా, సీఐడీ మరియు ఉమెన్ సేఫ్టీ వింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సైబర్ నేరాల దర్యాప్తు, డిజిటల్ ఫోరెన్సిక్స్, సాంకేతిక ఆధారిత పోలీసింగ్‌లో సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ ఆధునిక సదుపాయాలను ఏర్పాటు చేశారు. ల్యాబ్‌లో ఏఐ ఆధారిత స్మార్ట్ బోర్డులు, కంప్యూటర్ వర్క్‌స్టేషన్లు, వీడియో కాన్ఫరెన్సింగ్, హైస్పీడ్ ఇంటర్నెట్, హైబ్రిడ్ లెర్నింగ్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచాల్సిన అవసరం ఉందని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే సైబర్ నేరాల దర్యాప్తులో షీ సైబర్ ల్యాబ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు కొత్తగా ప్రారంభించిన ఈ సదుపాయాలు రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులకు శిక్షణ, విజ్ఞాన మార్పిడి, వృత్తిపరమైన అభివృద్ధికి ఉపయోగపడతాయని సీఐడీ డీజీ చారు సిన్హా అన్నారు.

# ఖమ్మం బాధితురాలిని పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, జూన్ 12:**

ఖమ్మం ఘటనలో గాయపడిన బాలికను, ఆమె కుటుంబ సభ్యులను నిమ్స్ ఆసుపత్రిలో ఎంపీ ఈటల రాజేందర్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి బాలిక ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. బాలికపై జరిగిన దారుణం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలికకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు, వైద్య ఖర్చులను ప్రభుత్వమే పూర్తిగా భరించాలని కోరారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే దుర్మార్గుల్లో భయం కలిగేలా ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాలిక ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వైద్యులు మరికొన్ని రోజులు పరిశీలన అవసరమని చెబుతున్నారని తెలిపారు.

# సంక్షేమ శాఖల్లో అవినీతి నిరూపిస్తే దేనికైనా సిద్ధం

## హరీశ్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

**హైదరాబాద్ జూన్12 :**

సంక్షేమ శాఖల్లో అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల్లో పారదర్శకంగా నిర్ణయాలు తీసుకుంటున్నామని చెప్పారు. తాను బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా, అజారుద్దీన్ మైనార్టీ శాఖ మంత్రిగా, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎస్సీ, ఎస్టీ శాఖ మంత్రిగా ఉన్నామని తెలిపారు. ఈ శాఖల్లో అవినీతి జరిగిందని నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా సిద్ధమని పొన్నం సవాల్ విసిరారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం అవినీతిలో మునిగిపోయిందని, అదే భావనతో హరీశ్‌రావు నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

# సమ్మక్క–సారక్క ఎత్తిపోతల పథకానికి ఎన్ వోసీ ఇవ్వండి

## చత్తీస్ ఘడ్ సీఎంతో భేటీ లో కోరిన మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్ జూన్12:**

హైదరాబాద్‌కు చేరుకున్న చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయిని పార్క్ హయత్‌లో మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా స్వాగతించారు. అనంతరం నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమ్మక్క–సారక్క ఎత్తిపోతల పథకంపై సమావేశమై, ప్రాజెక్టుకు అవసరమైన ఎన్‌వోసీ మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం తరపున విజ్ఞాపన పత్రం అందజేశారు. ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీటి భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నామని, అంతర్రాష్ట్ర అంశాల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# తొలి వర్షా నికే చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్: కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 12:**

తొలి వర్షానికే హైదరాబాద్ నగరం అతలాకుతలమవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ K. T. Rama Rao విమర్శించారు. నగరంలో భారీ ట్రాఫిక్ సమస్యలు, ప్రజల ఇబ్బందులపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం బాధ్యతారాహిత్యమని ఆరోపించారు.

వర్షాకాలానికి ముందస్తు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, డ్రైనేజీలు, మురుగు కాలువల శుభ్రత వంటి చర్యలు చేపట్టకపోవడం వల్లే నగరంలో ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని కేటీఆర్ పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన ఎస్ఎన్‌డీపీ, ఎస్ఆర్‌డీపీ ప్రణాళికల వల్ల నగర సమస్యలు తగ్గాయని, ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని అన్నారు.

హైదరాబాద్‌ను రాష్ట్ర ఆర్థిక ఇంజన్‌గా భావించి అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించిన కేటీఆర్, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. రానున్న

## రెడ్‌గ్రామ్ విత్తనాల పంపిణీ AEO శ్రీపతి రెడ్డి,రుద్రారం క్లస్టర్



కొడంగల్ మండలం, జూన్,12

శుక్రవారం రుద్రారం క్లస్టర్ పరిధిలో రెడ్‌గ్రామ్ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా, TDRG-59 అనే అధిక దిగుబడి ఇచ్చే విత్తన రకం రైతులకు అందజేయబడింది.

- ⦿ రైతుకు 4 కిలోల ప్యాకెట్ ఇవ్వబడుతుంది.
- ⦿ఒక ఎకరానికి ఒక ప్యాకెట్ సరిపోతుంది.
- ⦿ విత్తనాలను విత్తే ముందు విత్తన శుద్ధి (Seed Treatment) తప్పనిసరిగా చేయాలి.
- ⦿ ఫంగిసైడ్ (Thiram/Carbendazim) తో శుద్ధి చేయడం ద్వారా విత్తన వ్యాధులు తగ్గుతాయి.
- ⦿ రైజోబియం కల్చర్ వాడితే మొక్కలు బలంగా పెరుగుతాయి, దిగుబడి పెరుగుతుంది.రైతులు విత్తన శుద్ధి చేసి విత్తనాలను విత్తితే, అధిక దిగుబడి సాధించవచ్చు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు మంచి లాభాలు పొందాలని ఆకాంక్షిస్తున్నాను.

## భారతీయ నావికుల మృతిపై సీసీజీజీఓఓ ఆగ్రహం

హైదరాబాద్ జూన్12:

స్వతంత్ర దర్యాప్తు, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్

ఒమన్ తీరంలో 'సెట్టిబెల్లో' చమురు నౌకపై అమెరికా సైనిక దళాల క్షిపణి దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మృతి చెందడాన్ని సీసీజీజీఓఓ తీవ్రంగా ఖండించింది. మృతుల్లో విశాఖపట్నానికి చెందిన చీఫ్ ఇంజనీర్ పట్నాల సురేష్ (44), డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ (23), ఇంజన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా ఉన్నారు. ఈ ఘటనపై స్వతంత్ర అంతర్జాతీయ దర్యాప్తు చేపట్టాలని, సంఘర్షణ ప్రాంతాల్లో పనిచేస్తున్న భారతీయ నావికుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సీసీజీజీఓఓ జాతీయ చైర్మన్ వి. కృష్ణ మోహన్ డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు తగిన పరిహారం, బీమా సాయం అందించి, ఆధారితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని కోరారు. అధిక ప్రమాద ప్రాంతాల్లో విధులు నిర్వహించే నావికులకు యుద్ధ ప్రమాద భత్యం, మెరుగైన బీమా సదుపాయాలు కల్పించాలని ఆయన సూచించారు. అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రధాని ఖండించి ప్రపంచ శాంతికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, గాయపడిన సిబ్బందికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

- **4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ – రూ.1,031 కోట్ల కొనుగోలు**
- **ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా – ప్రభుత్వ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు**



పెద్దపల్లి, జూన్ 12

జిల్లాలో యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించినట్లు వెల్లడించారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తి చేసినట్లు తెలిపారు. ఐడీఓసీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొన్నారు. సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందన్నారు. జిల్లాలో 18,191 ఎకరాల్లో సాగైన మొక్కజొన్న పంటలో భాగంగా 26 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరిగిందని, రూ.63.40 కోట్ల విలువైన మొక్కజొన్న సేకరించినట్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని, ప్రజలు అవసరమైన పత్రాలు సమర్పించాలని సూచించారు. ఇటుక బట్టీల కోసం మట్టి రవాణాకు అనుమతులు ఇచ్చినప్పటికీ దుర్వినియోగాన్ని అరికట్టేందుకు పటిష్టమైన వ్యవస్థ అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులు వ్యవసాయ అవసరాలకు ఉచితంగా మట్టిని వినియోగించుకోవచ్చన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, బొమ్మారెడ్డిపల్లి, నరసింగాపూర్ ప్రాంతాల్లో మొత్తం 120 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆక్రమణలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. పెద్దపల్లి, రామగుండం ఏటీసీలలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని, జూన్ 30 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మంథనిలో కొత్త ఏటీసీ ఏర్పాటు కోసం భూమి కేటాయింపు పూర్తైందని వెల్లడించారు.

## స్వదేశీ ఏఐ వీడియో మోడల్ 'వర్యా' ఆవిష్కరణ

న్యూఢిల్లీ, జూన్ 12

కేంద్ర ప్రభుత్వ ఇండియా ఏఐ మిషన్ మద్దతుతో అవతార్.ఏఐ సంస్థ అభివృద్ధి చేసిన స్వదేశీ వీడియో జనరేటింగ్ ఏఐ మోడల్ 'వర్యా' ను ఆవిష్కరించారు. టెక్స్ట్ లేదా చిత్రాలను వీడియోలుగా మార్చగల ఈ మోడల్, వీడియో రూపొందించే ప్రక్రియను 50 దశల నుంచి 4 దశలకు తగ్గించి వేగం, సామర్థ్యాన్ని పెంచినట్లు సంస్థ తెలిపింది. సెకనుకు కేవలం ₹0.48 ఖర్చుతో వీడియోలను రూపొందించగలదని, ఇది ప్రపంచంలోని ప్రముఖ మోడళ్లతో పోలిస్తే 10 రెట్లు వరకు తక్కువ వ్యయమని వెల్లడించింది. విద్య, ఈ-కామర్స్, ప్రకటనలు, ప్రభుత్వ సమాచార ప్రచారం వంటి రంగాల్లో 'వర్యా' ఉపయోగపడనుంది. భారతీయ సంస్కృతి, ప్రాంతీయ వైవిధ్యాలను అర్థం చేసుకుని వీడియోలు రూపొందించేలా దీనిని అభివృద్ధి చేశారు.

# కాంగ్రెస్ కుట్రల వల్లే మీనాక్షి నటరాజన్ ఓటమి: కేటీఆర్

హైదరాబాద్, జూన్ 12:

మీనాక్షి నటరాజన్ ఓటమికి పూర్తిగా కాంగ్రెస్ పార్టీయే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్‌లోని అంతర్గత విభేదాలు, ద్రోహ రాజకీయాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ పార్టీ లోపల ఉన్న ద్రోహులను గుర్తించాలని సూచించారు.

**హిట్లర్ వ్యాఖ్యలపై రేవంత్‌కు కేటీఆర్ కౌంటర్**

హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పుకునే వ్యక్తి మానసిక రుగ్మతతో బాధపడుతున్నట్టేనని కేటీఆర్ విమర్శించారు. యుద్ధ విధ్వంసాన్ని గొప్పగా చెప్పుకోవడం బాధ్యతారాహిత్యమని పేర్కొన్నారు. సీఎం వ్యాఖ్యలను సమర్థించిన మంత్రి శ్రీధర్ బాబుపై కూడా ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

**హైదరాబాద్ వర్షా ల నిర్వహణలో ప్రభుత్వం విఫలం**

వర్షాకాల సన్నద్ధతలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ, ఫ్లైఓవర్ల వల్లే నగర పరిస్థితి కొంత మెరుగ్గా ఉందన్నారు. హైడ్రా సంస్థ బ్లాక్‌మెయిలింగ్, వసూళ్లకే పరిమితమైందని విమర్శించారు.

**బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు త్వరలో ప్రారంభం**

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెలాఖరులో ప్రారంభమయ్యే అవకాశం ఉందని కేటీఆర్ తెలిపారు. మొబైల్ యాప్ సిద్ధమైందని, అనంతరం పార్టీ కమిటీల



ఏర్పాటు, కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

**వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుంది**

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పరిమితం అవుతుందని, ఎలాంటి పొత్తులు లేకుండానే బీఆర్ఎస్ ఎన్నికల బరిలోకి దిగుతుందని స్పష్టం చేశారు.

**డీలిమిటేషన్‌పై దక్షిణాది ప్రయోజనాలు కాపాడాలి**

దక్షిణ భారత రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా ఉంటేనే డీలిమిటేషన్‌కు మద్దతు ఇస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రాతినిధ్యం తగ్గించే ప్రయత్నాలు జరిగితే తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు.

**రాజసౌధాల నిర్మాణంపై సీఎం వివరణ ఇవ్వాలి**

భూముల అమ్మకాల ద్వారా వచ్చిన నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయో ప్రభుత్వం వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం కొత్త హెలికాప్టర్లు, రాజసౌధాల నిర్మాణంపై పారదర్శకత పాటించాలని కోరారు.

**రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలింది**

కాంగ్రెస్ పాలనలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని కేటీఆర్ ఆరోపించారు. దీనివల్ల లక్షలాది మందికి ఉపాధి ప్రమాదంలో పడిందన్నారు. మోడీ 12 ఏళ్ల పాలనలో తెలంగాణకు ఒరిగింది శూన్యం ప్రధాని నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో దేశానికి, తెలంగాణకు చెప్పుకోదగ్గ ప్రయోజనం ఏదీ కలగలేదని కేటీఆర్ విమర్శించారు. హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.

**తెలంగాణ జలాల కోసం పోరాడింది బీఆర్ఎస్ మాత్రమే**

కృష్ణా, గోదావరి జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాల కోసం కేసీఆర్ మాత్రమే పోరాటం చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నీటి అంశంలో ఒకే వైఖరితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.

సింగరేణిలో అక్రమాలపై విచారణ జరపాలి

సింగరేణిలో భారీ అక్రమాలు జరిగాయని ఆరోపించిన కేటీఆర్, టెండర్ల రద్దు వెనుక కారణాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు.

## తాలిపేరు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించాలి...

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

- **జిల్లా కలెక్టర్ అంకిత్..**

జూన్ 12:

దుమ్ముగూడెం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాగునీటి సరఫరా, వైద్య సేవల నిర్వహణపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. మొదటగా వీరభద్రపురం గ్రామం పరిధిలోని తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాళిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాల భూమికి సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా సుమారు 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పెరిగిన గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. రైతులకు సాగునీరు సకాలంలో అందేలా కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరేలా పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఆరోగ్య కేంద్రంలోని వివిధ విభాగాలను పరిశీలించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును సందర్శించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.

## పోలీస్ వాహనాలను ఎల్లప్పుడూ కండిషన్ లో ఉంచుకోవాలి

**MTO ఆర్ఐ విజయ్ భాస్కర్**

నారాయణపేట, జూన్,12 :



నారాయణపేట సర్కిల్ పరిధిలోని నారాయణపేట టౌన్, నారాయణపేట రూరల్, దామరగిద్ద పోలీస్ స్టేషన్లకు చెందిన పోలీస్ పెట్రో కార్లు, బ్లూ కోల్ట్స్ వాహనాలను మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) విజయ్ భాస్కర్ శుక్రవారం జిల్లా పోలీసు హెడ్ క్వాటర్స్ లో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్లలో ఉన్న వాహనాల నిర్వహణ, ఇంజిన్ పనితీరు, బ్రేకులు, టైర్లు, లైట్లు, సైరన్లు, ఇతర భద్రతా పరికరాలను పరిశీలించారు. వాహనాలు ఎల్లప్పుడూ అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండేలా సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఆర్ఐ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ...పోలీస్ వాహనాలు ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు కీలకమని తెలిపారు. వాహనాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచడంతో పాటు సాంకేతిక లోపాలు తలెత్తకుండా నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. చిన్నపాటి మరమ్మతులు అవసరమైనా వెంటనే చేయించుకోవాలని, వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వహించరాదని సూచించారు.పోలీస్ సిబ్బంది వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఇంధన వినియోగం, వాహనాల పనితీరు, భద్రతా ప్రమాణాలను క్రమం తప్పకుండా పరిశీలించాలని పేర్కొన్నారు. వాహనాలు ఎల్లప్పుడూ మంచి కండిషన్‌లో ఉంటేనే అత్యవసర సమయాల్లో వేగంగా స్పందించి ప్రజలకు మెరుగైన సేవలు అందించగలమన్నారు.ఈ తనిఖీలలో సంబంధిత పోలీస్ స్టేషన్ల వాహనాల డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మీసేవ సేవల అమలులో పారదర్శకతకు ప్రాధాన్యత

**ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు**

కొత్తగూడెం జూన్12

ప్రజలకు మీ సేవా ద్వారా అందిస్తున్న సేవలను మరింత పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ విధానాలపై ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు అధికారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం కొత్తగూడెం తహసీల్దార్ పుల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్‌ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సైదేశ్వరరావు మాట్లాడుతూ ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవలకు సంబంధించిన మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించబడుతుందని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన డిజిటల్ పత్రాలను మాత్రమే పరిశీలించి, నిబంధనల మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీపీఓలు, ఎంఆర్ఐల వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై అధికారులకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలనను సులభతరం చేసి, నిర్ణీత గడువులోగా పరిష్కరించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు రుసుములు



వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలను కచ్చితంగా నమోదు చేయడంతో పాటు, డేటా ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు ఎదురైతే సంబంధిత తహసీల్దార్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జీపీఓలు, ఆర్ఐలు, మీసేవ వీఎల్‌ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



## 512 మంది చిన్నారులను రక్షించిన దక్షిణ మధ్య రైల్వే ఆర్‌పీఎఫ్

హైదరాబాద్, జూన్ 12

'ఆపరేషన్ నన్హే ఫరిష్తే'లో భాగంగా దక్షిణ మధ్య రైల్వే రక్షణ దళం 2026 జనవరి నుంచి మే వరకు 512 మంది చిన్నారులను రక్షించింది. వీరిలో 421 మంది బాలురు, 91 మంది బాలికలు ఉన్నారు.

రైల్వే స్టేషన్లు, రైళ్లలో ఒంటరిగా, ఆపదలో ఉన్న చిన్నారులను గుర్తించి బాల సంక్షేమ కమిటీకి అప్పగించారు. గతంలో 2025లో 1,622 మంది, 2024లో 1,390 మంది చిన్నారులను ఆర్‌పీఎఫ్ రక్షించింది. ఈ సేవలపై దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ ఆర్‌పీఎఫ్ బృందాన్ని అభినందించారు. స్టేషన్లు, రైళ్లలో ఒంటరిగా లేదా ఆందోళనకర పరిస్థితుల్లో ఉన్న చిన్నారులు కనిపిస్తే వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కు సమాచారం ఇవ్వాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు.

చురకలు



# యాలాల పోలీస్ స్టేషన్ ను సందర్శించిన- జిల్లా ఎస్పీ

- 'సురక్ష మిత్ర' మరియు 'నిఘా నేత్రం'కార్యక్రమాల ప్రాముఖ్యతపై....
- పోలీస్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలి-ఎస్పీ



**యాలాల మండలం, జూన్,12 :**

వార్షిక తనిఖీలలో భాగంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS శుక్రవారం యాలాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణతో పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు. అలాగే స్టేషన్‌లోని వివిధ రికార్డులు, రిజిస్టర్లను నిశితంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వివరాలు, నమోదైన కేసుల పురోగతి, బ్లా కోల్ట్స్ మరియు పెట్రో కార్ల నిర్వహణ తీరు గురించి ఆరా తీశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా ప్రజలకు పారదర్శకమైన, సత్వర స్పందనతో కూడిన సేవలను అందించడమే పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. చట్ట అమలులో నిష్పాక్షికతను పాటించాలని, బాధితులకు సేవలందించడంలో పూర్తి పారదర్శకత కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు స్టేషన్ పరిధిలో ఎలాంటి కేసులు లేదా ఫైళ్లను పెండింగ్‌లో ఉంచవద్దని, ఎప్పటికప్పుడు దర్యాప్తును పూర్తి చేసి సంబంధిత వివరాలను ఆన్‌లైన్ (CCTNS)లో నమోదు చేయాలని ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని, రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, వృద్ధుల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఇటీవల జిల్లాలో ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన 'సురక్ష మిత్ర' మరియు 'నిఘా నేత్రం' కార్యక్రమాల ప్రాముఖ్యతపై పోలీస్ అధికారులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ సూచించారు.ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీ యాదయ్య, యాలాల ఎస్సై విఠల్ రెడ్డి, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శిథిలవస్థలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్

- వాటర్ ట్యాంక్ పై కప్పు కూలడంతో భయాందోళనలో స్థానికులు*
- ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుబంటున్న కాలనీవాసులు*
- కొత్త వాటర్ ట్యాంకును నిర్మించాలని స్థానికులు నిరసన*





**మద్దూరు మున్సిపల్, జూన్,12 :**

నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీ కేంద్రంలో అమరగడ్డ మూడవ వార్డులో ఉన్న మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సుమారుగా నిర్మించి 40 సంవత్సరాలు పూర్తి కావడంతో, శిథిలావస్థకు చేరిందని స్థానికులు తెలిపారు. రాత్రి సుమారుగా 12 గంటల సమయంలో ఒక్కసారిగా వాటర్ ట్యాంక్ పైకప్పు కూలడంతో పెద్ద పెద్ద శబ్దాలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు ఒక్కసారిగా భయాందోళన చెందుతున్నారు.శిథిలావస్థకు చేరిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ వల్ల చుట్టుపక్కల నివసించే స్థానికులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకును వెంటనే కొత్త వాటర్ ట్యాంకును నిర్మించాలని, అమరగడ్డ స్థానికులు నిరసన తెలిపారు. శిథిలావస్థకు చేరుకున్న వాటర్ దగ్గర చుట్టుపక్కల ఉన్న చిన్న పిల్లలు అక్కడే ఆడుతూ పాడుతూ ఉంటారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. దానివల్ల ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును వెంటనే పునర్ నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# వారాంతపు మార్కెట్ యార్డ్ ను సద్వినియోగం చేసుకోవాలి

**పేట లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పునః ప్రారంభించిన కలెక్టర్ సీ. హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట, జూన్,12:**

వారాంతపు మార్కెట్ యార్డ్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్) యార్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సమీకృత మార్కెట్ యార్డులో వివిధ రకాల సేంద్రీయ కూరగాయలు పండ్లు పూల ఉత్పత్తులు ఆహార ధాన్యాలు మహిళా సంఘాల ఉత్పత్తులు రాగి లడ్డూలు జనపనార సంచులు మట్టి కుండలు మట్టి ఆభరణాలు పచ్చళ్ళు వెదురు ఉత్పత్తులు చేనేత చీరలు హస్తకళ ఉత్పత్తులు కళాకారుల కుమ్మరి ఉత్పత్తులు జనపనార తదితర వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించటానికి ముఖ్య ఉద్దేశ్యం నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి అని తెలిపారు. సేంద్రీయ ఎరువులు తయారీ వాటి ప్రదర్శన అమ్మకాలు స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు ఆన్ లైన్ ద్వారా అమ్మకాలు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసే ఉత్పత్తులు వాటిని ప్రజలు ఆదరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం లో ఒక శుక్రవారం ఇక్కడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో ఆయా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు వారంతపు మార్కెట్ ను ఉపయోగించుకుని రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు కొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు.మున్సిపాలిటీ కమిషనర్, డిఆర్డిఏ , హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు సమన్వయంతో ప్రతి శుక్రవారం ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, పుర కమీషనర్ శంకర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్ పర్సన్ మంజుల, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, కౌన్సిలర్ భరత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు అరుంధతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# పరిగి "షీ" టీమ్ పోలీసుల అవగాహన కార్యక్రమం




- జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్ మరియు పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు,

**పరిగి మున్సిపల్ జూన్,12:**

పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని లేబర్ అడ్డ దగ్గర పరిగి సబ్ డివిజన్ "షీ" టీమ్ ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో శుక్రవారం ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు: 1 మహిళలపై జరుగుతున్న నేరాలు,2 నిర్భయ చట్టం, POCSO చట్టం గురించి, 3 .100 డయల్, "షీ" టీమ్ నం – 181 సీసీ కెమెరాలు,4 బాల్య వివాహాలు, 5 బాల కార్మిక వ్యవస్థ,6 కమ్యూనిటీ పోలీసింగ్,7 మానవ అక్రమ రవాణా,8 ,మద్యపాన నిషేధం,9 బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు,10 గంజాయి నిర్మూలన,11 డ్రగ్స్ నిషేధం,12 సైబర్ నేరాలపై అవగాహన (నం: 1930).వివిధ అంశాల మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డెయిలీ లేబర్ "షీ" టీమ్ సభ్యులు సావిత్రి, శోభ పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాలల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి చేయాలి

## కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

**కామారెడ్డి జూన్12(సమయం న్యూస్)**

కామారెడ్డి జిల్లా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపడుతున్న మైనర్ రిపేర్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచే యాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మరమ్మతు పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీర్లకు సూచించారు. అలాగే పనుల పురోగతిని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం నిరంతరం పర్యవేక్షిస్తూ కళాశాలలను సందర్శించాలని, సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి షేక్ సలాం, బాన్సువాడ డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ అంజయ్య, కామారెడ్డి డివిజన్ పంచాయతీ రాజ్ ఇంజనీర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# అంకం రాహుల్ మృతి కేసుపై ఉద్యమం ఉధృతం

## రేపు ప్రెస్ క్లబ్ లో తదుపరి కార్యాచరణ ప్రకటన

**హైదరాబాద్, జూన్ 12 :**

బీటెక్ విద్యార్థి అంకం రాహుల్ అనుమానాస్పద మృతి కేసులో న్యాయం కోసం చేపట్టనున్న తదుపరి కార్యాచరణను శనివారం ఉదయం 11 గంటలకు బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ప్రకటించనున్నట్లు బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ తెలిపారు. రాహుల్ మృతిపై 48 గంటల గడువు ఇచ్చినా ప్రభుత్వాలు, కళాశాల యాజమాన్యం స్పందించకపోవడం బాధాకరమన్నారు. మృతదేహాన్ని ఇప్పటికీ కుటుంబ సభ్యులకు అప్పగించకపోవడం, ఘటన వెనుక వాస్తవాలను వెలికితీయడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా, విద్యార్థి, సామాజిక సంఘాలతో కలిసి ఉద్యమాన్ని విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి నాయకులు లెంకల రేణుకా యాదవ్, పోత సునీత, చిక్క దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్ లో క్యాబ్ డ్రైవర్, బైక్ రైడర్ ఉద్యోగాలు

**పెద్దపల్లి, జూన్ 12 :**

తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ద్వారా దుబాయ్‌లో క్యాబ్ డ్రైవర్లు, బైక్ రైడర్ల ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ తెలిపారు. 23 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, సంబంధిత అనుభవం, ప్రాథమిక ఇంగ్లీష్ పరిజ్ఞానం ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పనితీరు ఆధారంగా క్యాబ్ డ్రైవర్లు నెలకు రూ.64,850 నుంచి రూ.1.03 లక్షల వరకు, బైక్ రైడర్లు సుమారు రూ.64,850 వరకు సంపాదించే అవకాశం ఉందన్నారు. దరఖాస్తుల చివరి తేదీ జూన్ 25. ఆసక్తి గల అభ్యర్థులు క్యూ ఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9440049520, 9440048590 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# పంటలకు విలువ పెంచడమే తెలంగాణ వ్యవసాయ భవిష్యత్తు: మంత్రి తుమ్మల

**హైదరాబాద్, జూన్ 12:**

రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, తెలంగాణ వ్యవసాయం ఉత్పత్తి కేంద్రిత విధానం నుంచి విలువ ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవసాయంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. AI, డ్రోన్లు, ప్రెసిషన్ ఫార్మింగ్ వంటి ఆధునిక సాంకేతికతలను వ్యవసాయంలో విస్తృతంగా వినియోగించాలని సూచించారు. రైతుల ఆదాయం పెరగాలంటే ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఎగుమతులపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. తెలంగాణను దేశ వ్యవసాయ దిక్సూచిగా నిలబెట్టడంలో విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషించాలని మంత్రి పిలుపునిచ్చారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలి:

## కలెక్టర్ -చిత్ర మిశ్రా



**కరీం నగర్ జూన్12**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో కార్మిక శాఖ రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ చిత్ర మిశ్రా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లి విద్యను అభ్యసించేలా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కోలా ప్రసాద్, అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# నర్సింగ్ కాలేజీని సందర్శించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జూన్ 12:**

మాక్లూర్ ప్రభుత్వ నర్సింగ్ కాలేజీని కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించి విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాలేజీకి వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పోలీస్ పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడిన కలెక్టర్ నర్సింగ్ కోర్సు అవకాశాలపై అవగాహన కల్పించి, భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బయటి వ్యక్తులను కాలేజీ లోనికి అనుమతించవద్దని నిర్వాహకులకు ఆదేశించారు.

చురకలు

శనివారం 13 జూన్ 2026

# స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తిచేయాలి

జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఆసిఫాబాద్ జూన్ 12 .**

నిరుద్యోగ యువతీ యువకులకు నైపుణ్య శిక్షణ అందించి, వారి భవిష్యత్తుకు తోడ్పడేలా నిర్మిస్తున్న స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరలోనే వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో పాత కలెక్టరేట్ భవనం వెనుక భాగంలో రూ.70 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్కిల్స్ సెంటర్ భవన నిర్మాణ పనులను జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ధర్మేందర్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమంలో భాగంగా రూ.70 లక్షల నిధులతో ఈ స్కిల్స్ సెంటర్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ అందుబాటులోకి వస్తే జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం కలుగుతుందని అన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ ధర్మేందర్, జిల్లా సమన్వయకర్త సాంబశివరావు, ఏఈ గోపాల్, టాస్క్ జిల్లా మేనేజర్ రాకేష్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేటలో ప్లాస్టిక్ రహిత ఉద్యమానికి ఊతం




**సిద్దిపేట, జూన్ 12**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సిద్దిపేట మున్సిపల్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నోడల్ అధికారి టి. రవీందర్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను వివరించి, బట్ట సంచులు, నార సంచులు వంటి పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఇంటి వద్దే చెత్తను వేర్వేరుగా వర్గీకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం వ్యాపారులు, ప్రజలకు బట్ట సంచులు పంపిణీ చేసి ప్లాస్టిక్ రహిత సిద్దిపేట లక్ష్యంగా కృషి చేయాలని కోరారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి,

బాల కార్మికుల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్

**మహబూబాబాద్ జూన్12**

శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్, స్త్రీ శిశు సంక్షేమ, ఇంటర్మీడియట్ విద్యా శాఖ లపై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ అంగన్వాడి ప్రాజెక్ట్ లు, అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లల వివరాలు ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య పూర్తి సమచారం సిద్ధం చేయాలని, వచ్చే విద్యా సంవత్సరంలో 3 సం లోపు పిల్లల అడ్మిషన్లు పెంచాలని, వారికి రుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులు వివరాలు సేకరించి సంబంధిత స్తానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో చేర్పించి అడ్మిషన్లు పెంచాలని సూచించారు, ఇంటర్మీడియట్ పిల్లల విద్యా సామర్థ్యాలు పెంచేందుకు ప్రతీ మాసం స్లిప్ టెస్టులు నిర్వహించాలని, కాలేజ్ లో మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే చేయాలని, భవనాలు స్థితిగతులను పరిశీలించాలని, నూతన భవనాలు మరిన్ని అదనపు తరగతి గదులు ఏవైనా మరమ్మతులకోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు, వసతి గృహాల నిర్వహణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు, రవాణా సౌకర్యం నిమిత్తం వివరాలు సేకరించి బస్ ల సమయపాలన ప్రకారం జిల్లాలో ఏర్పాట్లు చేయాలని, కాలేజ్ కి వచ్చి తరగతులకు గైహాజరైన వారి వివరాలను నమోదు చేసుకోవాలని, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు బారిన పడకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు, జిల్లాలోని (10 ) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డుల నిర్వహణ ప్రిన్సిపల్ లో లెక్చరర్స్ విద్యార్థిని విద్యార్థుల యొక్క హాజరు శాతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు, ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదర్, కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

# "బాల కార్మిక రహిత సమాజం - మనందరి కల"

- ప్రభుత్వ చట్టాల గురించి తెలుసుకోవాలి.
- ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సమక్షంలో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం.




**నారాయణపేట, జూన్,12:**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నారాయణపేట లోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కాలేజీ లో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి మరియు లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ శ్రీ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. దానిలో భాగంగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా తదితర వాటిపై అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకోవడం బాల్య వివాహాలను చేయడం నేరమన్నారు.. బాల కార్మిక వ్యవస్థను నిర్మిలించేందుకు తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉందని అన్నారు. తమ పిల్లలను పనికి పంపించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. మన చుట్టుపక్కల ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే, వెంటనే చైల్డ్ లైన్ (1098) లేదా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పోక్సో 2012 , ఇది 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడానికి ఉద్దేశించబడింది అని అవగాహన కల్పించారు. ఈనాటి యువతరం రేపటి దేశ భవిష్యత్తు. కానీ దురదృష్టవశాత్తు కొన్ని దురలవాట్లు మన యువతను దారి మళ్లిస్తున్నాయి. వాటిలో మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత తీవ్రమైనది, ప్రమాదకరమైనది. యువత మత్తుకు దూరంగా ఉండి జీవితంలో ఒక లక్ష్యం ఏర్పరచుకొని దానికి కోసం కృషి చేయాలి అని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మి పతి గౌడ్ మాట్లాడుతూ న్యాయ సలహాల కోసము జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 మీద అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ శేషమ్మ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# రుణాలు అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలి

- జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సీ. హెచ్ ప్రియాంక.
- పేట జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకం విడుదల.

**నారాయణపేట, జూన్,12:**

రైతులు, విద్యార్థులు, ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరు లో బ్యాంకులు( బ్యాంకర్లు) చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇక్కడి వీసీ హాల్ లో డీ సీ సీ ( డిస్టిక్ కన్సల్టేటివ్ కమిటీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం లో బ్యాంకుల ద్వారా చేపట్టిన రుణాల పురోగతిపై కలెక్టర్ సమావేశంలో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, ఎం.ఎస్. ఎం.ఈ, విద్య, స్వయం సహాయక సంఘాల, ప్రభుత్వ పథకాల రుణాల మంజూరు పై కేటగిరి వారీగా సమీక్ష జరిపారు. రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు , స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆమె సూచించారు. జిల్లాలోని కొన్ని బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని, అలాంటి బ్యాంకులు వెంటనే తమ పనితీరును మెరుగుపరచుకొని లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకులు అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించి వ్యవసాయం, స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు తదితర రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని ఆమె కోరారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ముద్ర యోజన తదితర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులోపు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. చివరగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4524.78 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఎల్ డి ఓ శ్రీకాంత్, ఎస్ బి ఐ ఏ జీ ఎం పవన్ కుమార్, నాబార్డ్ డి డి ఎం మహేందర్, శీలా, కెనరా బ్యాంక్ నుంచి నరేష్, యూ బి ఐ నుంచి రమేష్ బాబు, డిఆర్డిఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్, హార్టికల్చర్ అధికారి సాయిబాబ, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నూనెగింజల రైతులకు వాట్సాప్‌లో ఏఐ సలహాలు

- ఇంటిగ్రేటెడ్ డీస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ పనులను పరిశీలించిన...
- రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి,పశుసంవర్ధక, మత్స్య,యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణపేట, జూన్,12 :**

నారాయణ పేట జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్ (ఐ డి ఓ సి ) పనులను రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక ,మత్స్య, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు. కలెక్టర్ ప్రియాంక తో కలిసి భవనం మొత్తం తిరిగి నిర్మాణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ లోని మీటింగ్ హాల్, మంత్రి ఛాంబర్, కలెక్టర్ ఛాంబర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు.కలెక్టరేట్ బిల్డింగ్ ప్రాంగణంలోనే హెలిపాడ్ ను ఏర్పాటు చేయవలసిందిగా అధికారులకు సూచన చేశారు.ఈ ఏడాది పంద్రాగస్టు వరకు భవన నిర్మాణం పూర్తి అయ్యి ఐ డి ఓ సి ని అందుబాటులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. చివరగా నూతన కలెక్టరేట్ సమీపంలోనే జిల్లా ఎస్పీ కార్యాలయానికి ఇచ్చిన 7 ఎకరాల ప్రభుత్వ స్థలం గురించి డీఎస్పీ లింగయ్య తో మంత్రి ఆరా తీశారు. అధికారులు,ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు



# పాలేరులో విద్యుత్ అభివృద్ధికి రూ.37.38 కోట్లు

సోలార్ పవర్ ప్లాంట్‌కు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

**తిరుమలాయపాలెం, జూన్12 :**

ప్రజా ప్రభుత్వం విద్యుత్ రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో రూ.3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 0.8 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌తో పాటు విద్యుత్ నియంత్రికల మరమ్మత్తు కేంద్రానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. గత రెండున్నరేళ్లలో పాలేరు నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అభివృద్ధి పనులకు రూ.37.38 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రూ.9 కోట్లతో మూడు సబ్‌స్టేషన్ల పనులు చేపట్టామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.



# జగ్గారెడ్డి దమ్ముంటే ఇంటి దొంగ పేరు బయటపెట్టాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై సిట్ విచారణకు సీఎం ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్

**సంగారెడ్డి, జూన్ 12 :**

మీనాక్షి నటరాజన్ వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేయడానికి ముందు కాంగ్రెస్‌లో జరిగిన పరిణామాలపై స్పష్టత ఇవ్వాలని ఆయన అన్నారు. మీనాక్షి నటరాజన్‌కు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నప్పటికీ, ఆమె నామినేషన్ ప్రక్రియకు ఆటంకం కలిగేలా సమాచారం ఇచ్చింది కాంగ్రెస్ నాయకులేనన్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నామినేషన్ నిలిచిపోవడానికి కామాలు, ఫుల్‌స్టాప్‌లే కారణమని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. జాతీయ స్థాయి నాయకురాలి అఫిడవిట్‌లో తప్పులు జరగడం కాంగ్రెస్ వైఫల్యమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా చెప్పబడుతున్న వ్యక్తే మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచాడనే ఆరోపణలపై కాంగ్రెస్ మౌనం ఎందుకు పాటిస్తోందని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత విభేదాలను దాచిపెట్టేందుకే బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన బీజేపీ మంత్రులు తెలంగాణ కాంగ్రెస్ నాయకులే సమాచారం ఇచ్చారని ఆధారాలతో చెబుతున్నప్పటికీ, దానికి సమాధానం చెప్పకుండా బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సరైంది కాదని అన్నారు. హరీష్ రావు చేస్తున్న విమర్శలు ఊహాగానాలు కాదని, ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అంశాలపై ఆధారాలతోనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని కోవర్టుల వ్యవహారాన్ని బయటపెట్టినందుకే హరీష్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని అన్నారు. మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సిట్ విచారణకు ఆదేశించి పూర్తి నిజాలు ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వర్గానికే చెందిన వ్యక్తులు ఈ వ్యవహారంలో పాత్ర పోషించారనే ఆరోపణలపై కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.



# కాకలు తీరిన కమ్యునిస్టు యోధుడు నంబూద్రిపాద్

## నేడు నంబూద్రిపాద్ జయంతి

నంబూద్రిపాద్ భారతీయ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన రాజకీయవేత్త, సిద్ధాంతకర్త. దేశ చరిత్ర లో గుర్తింపు పొందిన గొప్ప కమ్యూనిస్టు నాయకులు. భారత దేశంలో కాంగ్రెసేతర సంబంధిత కమ్యునిస్టు పార్టీ పక్షాన ఎన్నికైన తొలి ముఖ్యమంత్రిగా వినుతి కెక్కారు. మార్క్సి వాద సూత్ర బద్ధుడు, విప్లవవాది, రచయిత, చరిత్రకారుడు. మార్క్సి వాద కమ్యూనిస్టు పార్టీ ఆచరణ వాదిగా, క్రియాశీలక నేతగా, 14 యేళ్ళ పాటు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆయన తీసుకున్న చొరవ, ముందుచూపు గల నిర్ణయాలవలనే దేశంలో ఈనాడు జాతీయ స్థాయి సంకీర్ణ ప్రభుత్వ రాజకీయాలకు భూమిక అయిందన్న మాట వాస్తవం. నంబూద్రిపాద్ కేరళలో శ్రీకారం చుట్టిన మౌలికమైన భూ సంస్కరణలు, విద్యా సంస్కరణలను అనుకరించే ప్రయత్నాలు ఈ నాటికి ఇతర భారతీయ రాష్ట్రాలలో జరుగుతూనే ఉన్నాయి. సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యం కలిగి ఉన్నా, భూస్వామి కుటుంబంలో పుట్టినా శ్రామిక వర్గ లక్ష్యాలకు అంకితమై శ్రామిక విప్లవ ఉద్యమంలో అగ్ర నాయకుడిగా ఎదిగారు. ఇఎంఎస్ నంబూద్రిపాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి, మార్క్సిస్టు రుషి, నిరంతర క్రియాశీలి. అవిశ్రాంత కలం యోధులు. సాహితీ విమర్శకులు. సాంస్కృతిక సైనికుడు. పాలనా చతురులు. సిద్ధాంత, ఆచరణల సంగమం. విప్లవ మేధావి. భావితరాలకు చెరగని ఆదర్శం. ఒకనాటి భారత రాష్ట్రపతి కెఆర్ నారాయ–ణన్ అభివర్ణించినట్లుగా 20వ శతాబ్దపు మహోన్నత వ్యక్తి. ఇ.ఎం.ఎస్. అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఏలాంకుళం మనక్కళ్ శంకరన్ నంబూద్రిపాద్, (1909 జూన్ 13 -- 1998 మార్చి 19) 1909 జూన్ 13 నాడు, ప్రస్తుత మలప్పురం జిల్లా పెరింతాళ్ మన్న తాలూకా ఏలాంకుళం గ్రామంలోని అగ్ర బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి పేరు పరమేశ్వరన్ నంబూద్రిపాద్. విద్యార్థి దశనుంచే శాస్త్రీయ భావాలు అలవరుచుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర వహించారు. చిన్న వయసులోనే ఆయన వి.టి.భట్టాద్రిపాద్ మొదలయిన పెద్దవారికి చేయూతగా, కేరళ నంబూద్రి కుటుంబాలలో పాతుకు పోయిన కులవివక్ష, సాంప్రదాయ వాదం ధోరణులకు వ్యతిరేకంగా పోరాడారు. చదువుకునే రోజుల్లో భారత జాతీయ కాంగ్రెస్ సహచర్యంతో స్వాతం త్ర్య సంగ్రామంలో తీవ్ర కృషి చేసారు.

1931 లో కాలేజీని వదిలి స్వాతంత్ర్య పోరాటంలో చేరారు. సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అప్పటినుంచి ఆయన దేశ స్వాతంత్ర్యం కోసం సాగిన కాంగ్రెస్ ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషించారు. కేరళలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ స్థాపకుల్లో ఒకరుగా వున్నారు. 1934 లో ఆయన కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు పార్టీ అఖిల భారత ఉమ్మడి కాలంలో కాంగ్రెస్ పార్టీకి, కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మార్క్సిజంతో పరిచయం చేశారు. 1936 లో కేరళలో కమ్యూనిస్ట్ పార్టీ వ్యవస్థాపక బృందాన్ని ఏర్పాటు చేసిన ఐదుగురు సభ్యుల్లో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ కేరళలో ఒక శక్తివంతమైన కమ్యూనిస్ట్ ఉద్యమం అభివృద్ధికి పునాదులు వేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం, భూస్వామ్య వ్యతిరేక పోరాటం. రెండు పోరాటాలకు ఆయన ప్రాతినిధ్యం వహించారు. కేరళను ఏకీకృత భాషా రాష్ట్రంగా ఏర్పర్చడానికి దారితీసిన ఐక్య కేరళ ముఖ్య ప్రతిపాదకులలో ఆయన ఒకరు. నంబూద్రిపాద్ మొట్టమొదట 1939 లో మద్రాసు ప్రొవిన్షియల్ శాసనసభకు ఎన్నికయ్యారు. కమ్యునిస్ట్ పార్టీని విస్తృత పరచడానికి ఆయన తన వాటగా వచ్చిన ఆస్తిని పార్టీకి విరాళంగా ఇచ్చాడు. అతను 1939–42 మరియు 1948–50 మధ్య అజ్ఞాతంలోకి వెళ్ళారు. ఆయన 1941 లో భారత కమ్యూనిస్టు పార్టీ సెంట్రల్ కమిటీకి ఎన్నికయ్యారు. డిసెంబరు, 1950 లో సిపిఐ పొలిట్ బ్యూరో సభ్యుడిగా, సెక్రటేరియట్ సభ్యునిగా పనిచేశారు. 1957 లో కేరళ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరిగిన మొదటి ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీ మెజారిటీ సాధించడంతో 1957 ఏప్రిల్ 5 నాడు కేరళ రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి భారత దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్ట్ ముఖ్యమంత్రిగా రికార్డులకెక్కారు. త్వరలోనే భూ సంస్కరణల చట్టాన్ని,విద్యా చట్టాన్ని తీసుకు వచ్చారు. వివాదాస్పదమైన పరిస్థితుల్లో 1959 లో కేంద్ర ప్రభుత్వం, భారత రాజ్యాంగం లోని 356 వ ప్రకరణం అనుసరించి రాష్ట్రపతి పాలన విధిస్తూ ఆ ప్రభుత్వాన్ని కూల్చి వేసింది. కేరళ శాసన సభకు 1960–64, తిరిగి 1970–77 కాలంలో ప్రతిపక్ష నాయకునిగా వ్యవహరించారు.1967 లో రెండవసారి ముఖ్యమంత్రి కావడానికి నంబూద్రిపాద్ ముస్లిమ్ లీగ్ తో సహా 7 పార్టీల మద్దతు స్వీకరించారు. 1964 లో సిపిఐ (ఎం) ను స్థాపించిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ నుండి అందులో చేరారు. 1964 లో జరిగిన అఖిల భారత మహాసభలో పార్టీలో కేంద్ర కమిటీ మరియు పార్టీ పొలిట్ బ్యూరోకు ఎన్నికయ్యారు. ఆయన మరణం వరకు ఈ పదవిలో కొనసాగారు. 1977 లో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శిగా పదవిని చేబట్టి 1992 వరకు ఆ బాధ్యతలను నిర్వహించారు. అన్ని వామపక్ష, ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమీకరించడంలో ఆయన నాయకత్వం అమూల్యమైనది. ఒక తెలివైన మార్క్సిస్ట్ సిద్ధాంతకర్తగా, భారతీయ సమాజంలో పరిస్థితులకు అనుగుణంగా మార్క్సిజం – లెనినిజం అన్వయించడంతో పాటు భారతీయ విప్లవం యొక్క వ్యూహానికి అనుగుణంగా సాగించాల్సిన, సాగించిన కృషిని ఆయన రచించారు. ఆయన వ్రాసిన పలు గ్రంథాలలో కేరళ చరిత్ర అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. భూమి సంబంధాలు, కేరళ, సమాజం, రాజకీయాలు, మార్క్సిస్టు తత్వశాస్త్రం, సాహిత్యం మరియు చరిత్రలపై ఆయన వ్రాసిన రచనలతో ఆయన్ను దేశంలోనే గాక ప్రపంచంలోనే అత్యంత ప్రభావవంతమైన కమ్యూనిస్టు ఆలోచనా పరులలో ఒకరిగా గుర్తించ బడ్డాయి. విశిష్ట మార్క్సిస్ట్ సూత్రవేత్తగా, బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఆయన ముందు చూపుకు నిజాయితీ నిబద్ధతలకు కేరళ సాధించిన అభివృద్ధే తార్కాణం. ప్రజల యోజన ద్వారా కేరళలో అధికార, వనరుల వికేంద్రీకరణకు, అక్షరాస్యతా ఉద్యమానికి కృషి చేసారు. ఆంగ్ల, మలయాళ భాషల్లో అనేక పుస్తకాలు రచించిన నంబూద్రిపాద్ పత్రికా విలేఖరిగా కూడా సుపరిచితుడే. ఈ నాటికీ కేరళలో ఆయన పేరు, ఒకప్పటి ఈయన ప్రభుత్వ పనితీరుల గుటించి దినదినం గొప్పగా చెప్పుకుంటూనే ఉంటారు. నంబూద్రిపాద్ 1998 మార్చి 19 న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# అల్బినిజంపై సరైన అవగాహన అవసరం

## నేడు అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినోత్సవం





ప్రతి సంవత్సరం జూన్ 13న అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. అల్బినిజం అనే అరుదైన జన్యుపరమైన వైకల్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ రుగ్మత కారణంగా బాధపడుతున్న వ్యక్తులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య, సామాజిక, మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పట్ల ప్రపంచ సమాజం గళమెత్తి, అల్బినిజం ఉన్నవారికి హక్కులు, గౌరవం, రక్షణ లభించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అల్బినిజం అనేది శరీరంలో మెలనిన్ అనే వర్ణ ద్రవ్యం తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల కలిగే స్థితి. మెలనిన్ చర్మానికి, కళ్ళకు, వెంట్రుకలకు రంగును ఇచ్చే పదార్థం. దీనిలో లోపం వలన బాధితుల చర్మం తెలుపుగా, జుట్టు పసుపు లేదా తెల్లగా, కళ్ళు నీలం లేదా గులాబీ రంగులో కనిపిస్తాయి. ఈ వ్యాధి కేవలం శారీరకంగా కాకుండా, భావోద్వేగ మరియు సామాజికంగా తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది. అల్బినిజం అనేది ఒకే విధంగా ఉండదు. ఇందులో అనేక రకాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆక్యులోక్యూటేనియస్ అల్బినిజం అత్యంత సాధారణ రకం. ఇది చర్మం, కళ్ళు, వెంట్రుకలను ప్రభావితం చేస్తుంది. ఆక్యులర్ అల్బినిజం అనే రకం ప్రధానంగా కళ్లను మాత్రమే ప్రభావితం చేస్తుంది. ఇది ఒక వైరుధ్యమయమైన నిజం – అల్బినిజంతో బాధపడేవారికి, సమాజంలో వారి ప్రత్యేక స్వభావం వల్ల మానసికంగా తీవ్ర ఒత్తిడులు ఎదురవుతున్నాయి. చర్మం తెల్లగా ఉండటం వల్ల వారు ఇతరులకంటే భిన్నంగా కనిపించడం వల్ల బాల్యం నుంచే వారికి వివక్ష, తక్కువ చూపు, హింస ఎదురవుతుంది. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ఈ స్థితి మూఢనమ్మకాలకు గురై హింసాత్మకంగా మారింది. అక్కడ అల్బినిజం ఉన్నవారి శరీర భాగాలను తంత్ర శక్తుల కోసం వాడతారని నమ్మకం ఉంది. వీటిని అరికట్టడం కోసం ఐక్యరాజ్య సమితి 2013లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టి, 2015లో జూన్ 13ను అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినంగా ప్రకటించింది. అల్బినిజం ఉన్నవారు అనేక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతుంటారు. ముఖ్యంగా కంటి సమస్యలు – అస్టిగ్మాటిజం, నిస్టాగ్మస్, దృష్టి లోపం, కాంతి పట్ల అధిక స్పందన – ఎక్కువగా కనిపిస్తాయి. వీరు సూర్య కిరణాలకు మరింత సున్నితంగా ఉంటారు, దీంతో సన్‌బర్న్, చర్మ క్యాన్సర్ వంటి ప్రమాదాలు ఎక్కువ. వీటికి తోడు, వారు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, తక్కువ ఆత్మవిశ్వాసం, సమాజానికి దూరంగా ఉండే మానసిక స్థితి మరింత బాధాకరం. ప్రపంచంలో సగటుగా ప్రతి 17,000 నుంచి 20,000 మందిలో ఒకరికి అల్బినిజం ఉంటుంది. అయితే టాంజానియా వంటి దేశాల్లో ఇది మరింత అధికంగా ఉంది – సుమారు 1:1,400 జనాభాలో ఒకరికి ఇది ఉంటుంది. అల్బినిజంతో బాధపడే వారిపై హింసాత్మక దాడులు జరిగే అధికశాతం కేసులు ఆఫ్రికా ఖండంలోనే నమోదవుతున్నాయి.

ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా, ఈ దినోత్సవం ద్వారా తీసుకోవాల్సిన ముఖ్యమైన చర్యలు: అల్బినిజంపై సరైన అవగాహన కల్పించాలి. వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉచిత సన్‌స్క్రీన్, కళ్లద్దాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి. విద్యా రంగంలో ప్రత్యేక శిక్షణా పద్ధతులు, దృష్టి ఆధారిత ఉపకరణాలు అందించాలి. చట్టపరంగా వారి హక్కులను నిర్ధారించాలి. సమాజంలో సమానత్వం, గౌరవం కల్పించే విధంగా చైతన్యం కల్పించాలి. ఇది ఒక రోజు వేదిక మాత్రమే కాదు – ఇది ప్రతి ఒక్కరికి బాధితుల బాధను అర్థం చేసుకునే, మార్పు కోసం ముందడుగు వేయాల్సిన రోజు. అల్బినిజం ఉన్న వారు మానవాళిలో భాగమే. వాళ్లు కూడా సమాజంలో గౌరవంతో, భద్రతతో జీవించ గలగాలి. మనం అందరం కలిసి – అవగాహన, ఆమోదం, సహానుభూతి ద్వారా – ఒక సమానతాభిమాన సమాజాన్ని నిర్మించాలి. తెలుపు రంగు లోపం కాదు... అది ప్రత్యేకత. ఆ ప్రత్యేకతను గౌరవించడమే మన బాధ్యత.

# తరాల వారసత్వానికి గుర్తు కుట్టు యంత్రం

## నేడు జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం




ప్రపంచాన్ని శ్రమతో అలంకరించిన అనేక ఆవిష్కరణలలో కుట్టు యంత్రం ఒక గొప్ప మానవ ప్రయత్నానికి చిరుగుర్తుగా నిలిచింది. ప్రతి సంవత్సరం జూన్ 13న జరుపుకునే జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం ఈ పరికరం పట్ల మన కృతజ్ఞతను వ్యక్తపరచే ఒక ముఖ్యమైన సందర్భం. ఇది కేవలం ఒక యంత్రం మాత్రమే కాదు, ఒక విప్లవాత్మక మార్పు ప్రతీక. మానవ చరిత్రలో చేతివృత్తుల ప్రాధాన్యం తగ్గిపోకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సామర్థ్యాన్ని కలిగిన కుట్టు యంత్రం సామాజిక, ఆర్థిక, సాంకేతిక రంగాలలో గొప్ప పునర్నిర్మాణానికి నాంది పలికింది. కుట్టు యంత్రం చరిత్ర 18వ శతాబ్దానికి చెందింది. 1790లో థామస్ సెయింట్ అనే ఇంగ్లండ్‌కు చెందిన వ్యక్తి తొలిసారిగా కుట్టు యంత్రానికి పేటెంట్ దాఖలు చేశాడు. 1846లో ఎలియాస్ హవ్ అభివృద్ధిపరిచిన లాక్‌స్టిచ్ యంత్రానికి పేటెంట్ దక్కగా, 1851లో ఐజాక్ సింగర్ రూపొందించిన వినియోగ–అనుకూల మోడల్ యంత్రం వాణిజ్యంగా విస్తరించి ప్రపంచాన్ని ఆకర్షించింది. 1860 నాటికి అమెరికాలోనే దాదాపు 20 లక్షల యంత్రాలు అమ్ముడయ్యాయి.


తెలంగాణ రాష్ట్రంలో పరిశ్రమల శాఖ గణాంకాల ప్రకారం, రాష్ట్ర వ్యాప్తంగా 2023 నాటికి సుమారు 1.2 లక్షల మంది చిన్న టైలరింగ్, కుట్టు పనుల ద్వారా ఉపాధి పొందుతున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ ప్రాంతాల్లో మహిళల ఆధ్వర్యంలో నడిచే సూచి పరిశ్రమలు, స్వయం ఉపాధి కేంద్రాలు అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా మిషన్ భా రథతోపాటు మిషన్ కాకతీయ పరిధిలో మహిళా సంఘాల ద్వారా ఉషా ఇంజనీరింగ్, సింగర్ సంస్థల సహకారంతో పలు కుట్టు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు అయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (చీణజ) సహకారంతో వైఎస్సార్ విద్యా కానుక, జగ్గన్న వసతి దీవెన పథకాల క్రింద స్కూల్ యూనిఫాం తయారీకి వేలాది మంది మహిళలు గృహస్థాయిలో పని చేస్తున్నారు. విశాఖపట్నం, కర్నూలు, తెనాలి, చిత్తూరు వంటి ప్రాంతాల్లో సుమారు 60,000 మంది పైగా మహిళలు కుట్టు ఆధారిత ఉపాధితో జీవిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమల శాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. ఆధునిక యుగంలో మానవ కృషికి తోడుగా యాంత్రిక పరిజ్ఞానం కుదిరినట్లు, కుట్టు యంత్రాల తయారీలోనూ నూతన మార్గాలు రూధమవుతున్నాయి. కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాలు, ఆటోమేటిక్ స్టిచింగ్ మోడల్స్, డిజిటల్ ఫ్యాబ్రిక్ కట్టింగ్ సిస్టమ్స్ రూపుదిద్దుకుంటున్నాయి. 2023లో భారత్‌లో మాత్రమే డొమెస్టిక్ గృహ వినియోగ కుట్టు యంత్రాల అమ్మకాలు దాదాపు 12 లక్షల యూనిట్లకు చేరుకున్నాయి, అందులో 40% ఉషా, 25% సింగర్, 15% బ్రదర్ బ్రాండ్లు మార్కెట్‌ను ఆక్రమించాయి. కుట్టు యంత్రం ఒక పరికరం మాత్రమే కాదు. అది మన కుటుంబాల్లో గత తరం వారసత్వానికి గుర్తు. నానమ్మ చేతుల బరువు, అమ్మ శ్రమలోని ప్రేమ, తమ సొంత దుస్తులను కుట్టుకునే క్షణాల్లోని ఆత్మగౌరవం -- ఇవన్నీ కుట్టు యంత్రంలో లీనమై ఉంటాయి. ఇది ఒక సాధనమే అయినా, జీవన వేదికను రూపొందించగల సామర్థ్యం కలిగిన శక్తి. జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం మనం రోజూ చూసే కానీ గుర్తించని ఓ సాధనాన్ని గౌరవించేదిగా మారాలి. ఈ రోజు మనందరం మన కుట్టు యంత్రాలను పరిశుభ్రం చేసి, ఒక చిన్న పనితనం చేయడం ద్వారా మన సృష్టిశక్తికి గౌరవం తెలపవచ్చు. ఎందుకంటే అది కేవలం బట్టలు కుట్టే యంత్రం కాదు – అది జీవితాన్ని కుట్టే మేధో సాధనం. ప్రపంచాన్ని శ్రమతో అలంకరించిన అనేక ఆవిష్కరణలలో కుట్టు యంత్రం ఒక గొప్ప మానవ ప్రయత్నానికి చిరుగుర్తుగా నిలిచింది. ప్రతి సంవత్సరం జూన్ 13న జరుపుకునే జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం ఈ పరికరం పట్ల మన కృతజ్ఞతను వ్యక్తపరచే ఒక ముఖ్యమైన సందర్భం. ఇది కేవలం ఒక యంత్రం మాత్రమే కాదు, ఒక విప్లవాత్మక మార్పుకు ప్రతీక. మానవ చరిత్రలో చేతివృత్తుల ప్రాధాన్యం తగ్గిపోకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పని చేసే సామర్థ్యాన్ని పొందిన కుట్టు యంత్రం, సామాజిక, ఆర్థిక, సాంకేతిక రంగాలలో గొప్ప పునర్నిర్మాణానికి నాంది పలికింది. కుట్టు యంత్రం చరిత్ర 18వ శతాబ్దానికి వెళ్లి చేరుతుంది. 1790లో థామస్ సెయింట్ అనే ఇంగ్లాండ్‌కు చెందిన వ్యక్తి తొలిసారి కుట్టు యంత్రానికి పేటెంట్ దాఖలు చేశాడు. అయితే దాని ఆచరణాత్మకత, వినియోగ సామర్థ్యం అనేక సంవత్సరాల తర్వాతే అభివృద్ధి చెందాయి. 19వ శతాబ్దంలో వాల్టర్ హంట్, బర్తెలెమీ తిమొన్నియర్, ఎలియాస్ హవ్ వంటి కలు ఈ రంగాన్ని పురోగమింపజేసారు. ఈ క్రమంలో ఐజాక్ సింగర్ రూపొందించిన సులభమైన గృహ ఉపయోగ యంత్రాలు ఈ పరికరాన్ని సామాన్య జనానికి అందుబాటులోకి తీసుకు వచ్చాయి. హవ్‌కు లాక్‌స్టిచ్ పేటెంట్ ఉండడం వల్ల వచ్చిన న్యాయ పోరాటం, చివరకు సింగర్ సంస్థ ఏర్పడటం, పరిశ్రమల విస్తరణకు కారణమయ్యాయి. ఇందుకే కుట్టు యంత్రం ఒక పరికరం మాత్రమే కాదు, ఆధునీకీకరణకు వేదిక. ఇది చేతితో కుట్టే ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా, ఒకే విధంగా, ఒకే మోడల్‌లో, పెద్ద మొత్తంలో దుస్తులు తయారు చేసే అవకాశాన్ని కల్పించింది. అంతేకాక, మహిళలకు స్వయం ఉపాధి మార్గాలను అందించింది. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు తమ ఇంట్లోనే కుట్టు పనులు చేసుకుంటూ ఉపాధి పొందే పరిస్థితి ఏర్పడింది. ఇది మహిళా ఆర్థిక స్వావలంబనకు శుభ ప్రారంభంగా నిలిచింది. ఇప్పటికీ కుట్టు యంత్రం హస్తకళ, అల్లిక కళలకు మూలస్తంభంగా ఉంది. గ్రామీణ భారతంలోనూ, పట్టణాల గల్లీల్లోనూ ఈ యంత్రం మృదువుగా మృదువుగా ఆడుతుంది. ప్రతి ఇంటిలో ఓ మూలా నిలబడిన నల్లటి బరువైన యంత్రం, ఒక తల్లిని కుట్టుచూపిన జాలంగా కనిపిస్తుంది. పిల్లల స్కూల్ యూనిఫాంలు, పండుగల చీరలు, మతపరమైన వస్త్రాలు– అన్నీ ఆ యంత్రపు సూదిలోంచి జన్మిస్తుంటాయి. అది నెమలిపుంఖ వెండి తారను చెక్కే శిల్పం. ఆధునిక యుగంలో కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ యంత్రాలు, ఆటోమేటిక్ స్టిచింగ్ ఫీచర్లు, డిజిటల్ డిజైన్ అప్లికేషన్ల వాడకం పెరిగినా కూడా, పాత యంత్రం పట్ల మన బంధం మారలేదు. అది ఒక తరం గుర్తుగా నిలిచింది. దానికి నూనె వేసే మెలకువలు, సూది మార్చే నైపుణ్యం, నూలు చుట్టే ఓపిక – ఇవన్నీ ఒక శిల్పజ్ఞుని తత్వాన్ని చూపుతాయి. కుట్టు యంత్రం మనం ఆచరించే ఓ చిత్తశుద్ధి, ఓ నైపుణ్య సాంకేతికతను ప్రతిబింబిస్తుంది.

జాతీయ కుట్టు యంత్రం దినోత్సవం మనం రోజూ చూసే కానీ గుర్తించని ఓ సాధనాన్ని గౌరవించేదిగా మారాలి. మన నానమ్మలు, అమ్మలు నెమలికన్నుల చీరలకు జతచేసిన జ్ఞాపకాల వలె, ఈ యంత్రం కూడా మన కుటుంబాల జీవితాలలో ఓ మౌన ముద్ర వేసింది. ఈ రోజు మనందరం మన కుట్టు యంత్రాలను పరిశుభ్రం చేసి, ఒక చిన్న పనితనం చేయడం ద్వారా మన సృష్టిశక్తికి గౌరవం తెలపవచ్చు. ఎందుకంటే అది కేవలం బట్టలు కుట్టే యంత్రం కాదు – అది జీవితాన్ని కుట్టే మేధో సాధనం.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

చురకలు





## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు

**హైదరాబాద్, జూన్ 12 :** గత కొద్దిరోజులుగా స్వల్పంగా తగ్గుముఖం పట్టిన బంగారం, వెండి ధరలు ఈరోజు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. నిన్న స్వల్పంగా తగ్గిన ధరలు, ఈరోజు మాత్రం భారీ జంప్ నమోదు చేయడంతో కొనుగోలుదారులకు షాక్ తగిలింది. పెళ్లిళ్లు, శుభకార్యాల సీజన్ కొనసాగుతున్న వేళ ఈ పెరుగుదల మార్కెట్‌లో చర్చనీయాంశంగా మారింది. నిన్న 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై కేవలం రూ. 10 తగ్గుదల నమోదవగా, ఈరోజు అదే 24 క్యారెట్ల బంగారం ధర ఏకంగా రూ. 2,940 పెరిగింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ. 2,700 పెరగగా, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 2,210 పెరిగింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 1,48,580 వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,36,200కు చేరుకుంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,11,440గా నమోదైంది. ఇక వెండి ధరలు కూడా బంగారం బాటలోనే భారీగా పెరిగాయి. 100 గ్రాముల వెండిపై రూ. 500 పెరుగుదల నమోదవగా, కిలో వెండిపై ఏకంగా రూ. 5,000 పెరిగింది. దీంతో వెండి కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి కూడా అదనపు భారం పడుతోంది. హైదరాబాద్ మార్కెట్‌లో ప్రస్తుతం 100 గ్రాముల వెండి ధర రూ. 26,500గా ఉండగా, కిలో వెండి ధర రూ. 2,65,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో విలువైన లోహాల ధరలు పెరగడం, డాలర్ మారకం విలువల్లో మార్పులు, పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెరగడం వంటి కారణాల వల్ల దేశీయ మార్కెట్‌లో కూడా ధరలు ఎగబాకుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.రాబోయే రోజుల్లో అంతర్జాతీయ పరిస్థితులు, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల నిర్ణయాలు, డాలర్ బలహీనత లేదా బలపడటం వంటి అంశాలపై బంగారం, వెండి ధరల దిశ ఆధారపడి ఉంటుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ధరలు గరిష్ట స్థాయిల వద్ద కొనసాగుతున్న నేపథ్యంలో కొనుగోలుదారులు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్నారు.

## స్టాక్ మార్కెట్లలో భారీ జోష్

**ముంబై, జూన్ 12 :** దేశీయ స్టాక్ మార్కెట్లు నేడు భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ప్రవాహం, దేశీయ ఇన్వెస్టర్ల కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు రికార్డు స్థాయిలో పుంజుకున్నాయి. ఉదయం ప్రారంభమైన కొనుగోళ్ల జోరు రోజంతా కొనసాగడంతో కీలక సూచీలు గరిష్ట స్థాయిల వద్ద ముగిశాయి. ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,693.95 పాయింట్లు ఎగబాకి భారీ లాభంతో ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 461.30 పాయింట్లు పెరిగి కొత్త గరిష్టాల సమీపంలో స్థిరపడింది. ఈ పెరుగుదలతో పెట్టుబడిదారుల సంపద లక్షల కోట్ల రూపాయల మేర పెరిగినట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వస్తోందన్న సంకేతాలు ప్రపంచ మార్కెట్లకు ఊరటనిచ్చాయి. అక్కడ వడ్డీ రేట్ల తగ్గింపుపై ఆశలు పెరగడంతో అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొంది. అదే ప్రభావం భారత మార్కెట్లపై కూడా కనిపించింది. గత కొన్ని రోజులుగా ఒత్తిడిని ఎదుర్కొన్న సమాచార సాంకేతిక, బ్యాంకింగ్ రంగాల షేర్లు నేడు బలంగా పుంజుకున్నాయి. ప్రముఖ సంస్థల షేర్లలో భారీ కొనుగోళ్లు నమోదవడంతో మార్కెట్‌కు బలమైన మద్దతు లభించింది. ముఖ్యంగా బ్యాంకింగ్, సమాచార సాంకేతిక, ఆర్థిక సేవల రంగాలు మార్కెట్ ర్యాలీకి ప్రధాన కారణంగా నిలిచాయి. గత కొన్ని సెషన్లుగా విక్రయాలకు మొగ్గు చూపిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు మళ్లీ కొనుగోళ్ల బాట పట్టడం మార్కెట్‌కు మరింత ఊతమిచ్చింది. విదేశీ నిధుల ప్రవాహం పెరగడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచింది. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు అనుకూలంగా కొనసాగితే దేశీయ మార్కెట్లు మరింత బలపడే అవకాశం ఉంది. అయితే ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు, విదేశీ పెట్టుబడుల కదలికలు మార్కెట్ దిశను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా ఉండనున్నాయి. మొత్తంగా చూస్తే, నేటి ట్రేడింగ్‌లో అన్ని ప్రధాన రంగాల నుంచి మద్దతు లభించడంతో స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేసి పెట్టుబడిదారులకు ఆనందాన్ని పంచాయి. ప్రస్తుతం మార్కెట్ సెంటిమెంట్ బలంగా ఉండటంతో రానున్న రోజుల్లో కూడా సానుకూల ధోరణి కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.




# జీడీపీ గణాంకాలపై సందేహం

### 'ఏదో తేడాగా ఉంది' : రఘురామ్ రాజన్



**న్యూఢిల్లీ, జూన్ 12 :** భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి గణాంకాలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ సందేహాలు వ్యక్తం చేశారు. అధికారిక గణాంకాల ప్రకారం దేశ జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పైగా నమోదవుతున్నప్పటికీ, అదే స్థాయిలో కార్పొరేట్ పెట్టుబడులు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) కనిపించడం లేదని ఆయన పేర్కొన్నారు. జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన రఘురామ్ రాజన్, ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థలో కనిపిస్తున్న కొన్ని అంశాలు పరస్పరం పొంతన లేకుండా ఉన్నాయని వ్యాఖ్యానించారు. దేశ ఆర్థిక వృద్ధి నిజంగా అంత వేగంగా సాగుతున్నట్లయితే, పరిశ్రమలు, కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని, కానీ వాస్తవ పరిస్థితుల్లో అలాంటి ధోరణి కనిపించడం లేదని అన్నారు. "ఆర్థిక వ్యవస్థ ఇంత వేగంగా అభివృద్ధి చెందుతుంటే పెట్టుబడులు కూడా అదే స్థాయిలో పెరగాలి. కానీ అలాంటి సంకేతాలు కనిపించడం లేదు. అందుకే ఆర్థిక వ్యవస్థలో ఏదో తేడా ఉన్నట్లు అనిపిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. కార్పొరేట్ పెట్టుబడుల మందగమనం గత పదేళ్లుగా కొనసాగుతున్న ఒక పెద్ద ప్రశ్నగా మిగిలిపోయిందని రాజన్ తెలిపారు. గతంలో కూడా ఇదే అంశంపై చర్చ జరిగిందని, ఇప్పటికీ పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించడం లేదన్నారు. "గణాంకాల్లో కనిపిస్తున్న ఆర్థిక వృద్ధి కంటే వాస్తవ వృద్ధి కొంత నెమ్మదిగా ఉండే అవకాశం ఉందేమో" అని ఆయన అభిప్రాయపడ్డారు. దేశీయ మార్కెట్‌లో డిమాండ్ ఆశించిన స్థాయిలో లేకపోవడమే కంపెనీలు కొత్త పెట్టుబడులకు ముందుకు రాకపోవడానికి ఒక కారణం కావచ్చని ఆయన విశ్లేషించారు. జీడీపీ గణాంకాలు సూచిస్తున్న స్థాయిలో వినియోగదారుల డిమాండ్ లేకపోతే, కంపెనీలు ఉత్పత్తి విస్తరణపై ఆసక్తి చూపవని అన్నారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ప్రవాహం తగ్గడం కూడా ఆందోళనకర పరిణామమని రాజన్ పేర్కొన్నారు. విదేశీ సంస్థలు భారత్‌లో కొత్త ఫ్యాక్టరీలు, ఉత్పత్తి యూనిట్లు స్థాపించేందుకు పెద్దగా ముందుకు రావడం లేదని చెప్పారు. అలాగే విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు కూడా మార్కెట్ నుంచి నిధులను ఉపసంహరించుకుంటున్నారని, ఇది పెట్టుబడిదారుల విశ్వాసంపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. మరోవైపు దేశ ఇంధన అవసరాల కోసం భారత్ ఇప్పటికీ దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతోందని ఆయన గుర్తుచేశారు. పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు కొనసాగితే చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందని, దాని ప్రభావం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రంగా పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇంధన ధరల భారం ప్రజలపై పడకుండా ప్రభుత్వం కొంతకాలం వరకు నియంత్రణ చర్యలు తీసుకోవచ్చని, అయితే అది నిరంతరం సాధ్యం కాదన్నారు. ఎక్కువ కాలం పాటు సబ్సిడీలు లేదా ధరల నియంత్రణ కొనసాగితే ప్రభుత్వ ఖజానాపై భారం పెరిగి అప్పులు అధికమయ్యే ప్రమాదం ఉందని చెప్పారు. అలాంటి పరిస్థితుల్లో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల వంటి కీలక రంగాలకు కేటాయించే నిధులను ఇతర అవసరాల కోసం మళ్లించాల్సి వచ్చే ప్రమాదం ఉందని రఘురామ్ రాజన్ హెచ్చరించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు, వినియోగం, ఉపాధి అవకాశాలు సమతుల్యంగా పెరిగినప్పుడే స్థిరమైన వృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

# చమురు రంగంలో భారత్‌కు భారీ బలం




**న్యూఢిల్లీ, జూన్ 12 :** ఇప్పటి వరకు చమురు అవసరాల కోసం విదేశాలపై ఎక్కువగా ఆధారపడుతున్న భారత్, ఇప్పుడు ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పుడల్లా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరగడం, దాని ప్రభావం దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలపై పడటం సాధారణంగా కనిపించేది. అయితే భవిష్యత్తులో అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు భారత్ ముందస్తు వ్యూహాలతో ముందుకు సాగుతోంది. ఈ క్రమంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన ప్రముఖ జాతీయ చమురు సంస్థతో కుదిరిన వ్యూహాత్మక భాగస్వామ్యం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఒప్పందం ప్రకారం భారతదేశంలో నిల్వ ఉంచే చమురు పరిమాణాన్ని భారీగా పెంచే చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం దేశంలోని విశాఖపట్నం, మంగళూరు, పడూరు ప్రాంతాల్లో ఉన్న భూగర్భ చమురు నిల్వ కేంద్రాల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచే ప్రణాళికలు అమల్లోకి రానున్నాయి. ఈ నిల్వ సామర్థ్యం పెరగడం వల్ల అత్యవసర పరిస్థితుల్లో దేశీయ అవసరాలకు కావాల్సిన చమురును ఉపయోగించుకునే అవకాశం కలుగుతుంది. అంతేకాకుండా అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను బట్టి నిల్వల్లో ఉన్న చమురును ఇతర దేశాలకు విక్రయించే అవకాశాలు కూడా భారత్‌కు లభించనున్నాయి. దీని ద్వారా దేశానికి ఆర్థిక ప్రయోజనాలు చేకూరడమే కాకుండా ప్రపంచ చమురు మార్కెట్‌లో భారత్ ప్రభావం కూడా పెరిగే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. భారీ స్థాయిలో చమురు నిల్వలు అందుబాటులో ఉండటం వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల మార్పుల సమయంలో భారత్‌కు చర్చల్లో బలమైన స్థానం లభిస్తుంది. భవిష్యత్తులో ముడి చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడినా దేశ అవసరాలను కొంతకాలం పాటు స్వయంగా నిర్వహించుకునే సామర్థ్యం పెరుగుతుంది. అలాగే చమురు ఎగుమతి దేశాలతో ధరల విషయంలో మరింత అనుకూల ఒప్పందాలు చేసుకునే అవకాశాలు కూడా మెరుగుపడతాయి. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లోని ఫుజైరా ప్రాంతంలో కూడా భారతదేశం తన చమురు నిల్వలను ఉంచుకునే అవకాశాలను పరిశీలిస్తోంది. అంతర్జాతీయ రవాణా పరంగా కీలకమైన ఈ ప్రాంతం భౌగోళికంగా వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగి ఉంది. అక్కడ నిల్వలు ఏర్పాటు చేయడం ద్వారా సరఫరా వ్యవస్థ మరింత భద్రంగా మారే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. కేవలం పెట్రోల్, డీజిల్ అవసరాలకే పరిమితం కాకుండా వంటగ్యాస్, సహజ వాయువు నిల్వలను కూడా పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దేశీయ ఇంధన భద్రతను బలోపేతం చేయడం, దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిల్వ సామర్థ్యాన్ని పెంచడం వంటి లక్ష్యాలతో ఈ చర్యలు చేపడుతున్నారు. ఇంధన రంగంలో జరుగుతున్న ఈ వ్యూహాత్మక మార్పులు భారత్‌ను కేవలం వినియోగదారుడిగా కాకుండా ప్రపంచ ఇంధన మార్కెట్‌లో ప్రభావం చూపగల దేశంగా తీర్చిదిద్దే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు ఆర్థిక వ్యవస్థకు కూడా దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరే అవకాశం కనిపిస్తోంది.

# చైనా ఆంక్షలతో మిర్చి ఎగుమతులకు దెబ్బ



**న్యూఢిల్లీ, జూన్ 12 :** భారత్ నుంచి చైనాకు ఎగుమతి అవుతున్న ఎండు మిర్చిపై చైనా ప్రభుత్వం తాజాగా ఆంక్షలు విధించినట్లు సమాచారం. మిర్చిలో అనుమతించిన స్థాయికి మించి హానికర రసాయన అవశేషాలు ఉన్నాయని పేర్కొంటూ చైనా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో భారత ఎగుమతిదారులు, మిర్చి రైతుల్లో ఆందోళన నెలకొంది. చైనా అధికారుల ప్రకారం మిర్చిలో మిథామిడోపాస్ అనే రసాయన అవశేషాలు గుర్తించినట్లు వెల్లడించారు. ఈ రసాయనం మానవ ఆరోగ్యానికి హానికరమని, ముఖ్యంగా నాడీ వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. ఇదే కారణంతో భారత ఎండు మిర్చి దిగుమతులపై తాత్కాలిక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు సమాచారం. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి చైనాకు సుమారు 2.36 లక్షల టన్నుల ఎండు మిర్చి ఎగుమతి అయింది. మిర్చి ఎగుమతుల్లో చైనా కీలక మార్కెట్‌గా ఉండటంతో తాజా నిర్ణయం రైతులు, వ్యాపారులపై ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ఎగుమతులు తగ్గితే దేశీయ మార్కెట్లో సరఫరా పెరిగి ధరలు పడిపోయే ప్రమాదం ఉందని వ్యాపార వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచ మార్కెట్లో భారతీయ ఎండు మిర్చికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో పండించే మిర్చికి విదేశీ మార్కెట్లలో మంచి డిమాండ్ ఉంటుంది. అయితే దిగుమతి దేశాలు విధించే నాణ్యతా ప్రమాణాలు కఠినంగా ఉండటంతో రైతులు, ఎగుమతిదారులు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. గతంలో కూడా బియ్యం సహా పలు వ్యవసాయ ఉత్పత్తుల విషయంలో చైనా నాణ్యతా ప్రమాణాలను కారణంగా చూపుతూ ఆంక్షలు విధించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు మిర్చి విషయంలోనూ అదే తరహా చర్యలు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది.

వ్యవసాయ నిపుణుల అభిప్రాయం ప్రకారం ఎగుమతులను నిలబెట్టుకోవాలంటే పంటల్లో రసాయనాల వినియోగాన్ని నియంత్రించడం, అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించడం అవసరం. రైతులకు అవగాహన కల్పించడం, ఎగుమతులకు ముందు నాణ్యతా పరీక్షలను మరింత కఠినంగా నిర్వహించడం ద్వారా ఇలాంటి సమస్యలను తగ్గించే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు.

## జులై నుంచి టాటా కార్ల ధరలు పెంపు

**ముంబై, జూన్ 12 :** దేశీయ ఆటోమొబైల్ రంగ దిగ్గజ సంస్థ టాటా మోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను జులై 1 నుంచి పెంచనున్నట్లు ప్రకటించింది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, ముడి పదార్థాల ధరలు, ద్రవ్యోల్బణ ప్రభావం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ వెల్లడించింది. కంపెనీ ప్రకటన ప్రకారం అన్ని మోడళ్లపై గరిష్ఠంగా 1.5 శాతం వరకు ధరల పెంపు అమలు కానుంది. ఈ పెంపు సాధారణ ఇంధన వాహనాలతో పాటు విద్యుత్ వాహనాలపై కూడా వర్తించనుంది. అయితే అన్ని వాహనాలకు ఒకే స్థాయిలో ధరలు పెరగవని, మోడల్, వేరియంట్‌ను బట్టి పెంపు శాతం మారుతుందని సంస్థ స్పష్టం చేసింది. ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరిగినప్పటికీ వాటిలో ఎక్కువ భాగాన్ని సంస్థ ఇప్పటివరకు భరించిందని టాటా మోటార్స్ తెలిపింది. అయితే పెరుగుతున్న వ్యయభారాన్ని పూర్తిగా భరించడం సాధ్యం కాకపోవడంతో కొంత భారాన్ని వినియోగదారులపై మోపాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొంది. ఇటీవల దేశీయ ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపులు సాధారణంగా మారాయి. గత నెలలో మరో ప్రముఖ వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ కూడా తన వాహనాల ధరలను పెంచింది. అలాగే మారుతి సుజుకి జూన్ నెల నుంచి పలు మోడళ్లపై ధరల సవరణ చేపట్టగా, మహీంద్రా కూడా ఈ ఏడాది ప్రారంభంలోనే తన ఎస్‌యూవీలు, వాణిజ్య వాహనాల ధరలను పెంచింది. వాహన తయారీ సంస్థలు ఒకవైపు లాభదాయకతను కాపాడుకుంటూనే, మరోవైపు కొత్త సాంకేతికతలు, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలపై పెట్టుబడులు కొనసాగించేందుకు ధరల సవరణలను ఆశ్రయిస్తున్నాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.టాటా మోటార్స్ ధరల పెంపు ప్రకటన అనంతరం సంస్థ షేర్లు మార్కెట్లో స్వల్ప లాభాలతో ట్రేడింగ్ కొనసాగించాయి. జులై 1కు ముందు వాహనం కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ప్రస్తుతం ఉన్న ధరలే వర్తించనున్నాయి. కొత్త ధరలు అమల్లోకి వచ్చిన తర్వాత అన్ని కొత్త బుకింగ్‌లపై పెరిగిన ధరలు వర్తించనున్నాయి.





# 90 నిమిషాల్లో 30 కోట్లు..

## రొనాల్డో సంపాదన ఆశ్చర్యం

**న్యూఢిల్లీ, జూన్ 12 :**
ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యంత విజయవంతమైన ఆటగాళ్లలో ఒకరిగా నిలిచిన క్రిస్టియానో రొనాల్డో సంపాదన మరోసారి చర్చనీయాంశంగా మారింది. మైదానంలో కేవలం ఒక మ్యాచ్ ఆడినందుకే ఆయన అందుకునే పారితోషికం కోట్ల రూపాయల్లో ఉండటం ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రస్తుతం సౌదీ అరేబియాకు చెందిన అల్ నసర్ క్లబ్ తరఫున ఆడుతున్న రొనాల్డో వార్షిక ఆదాయం సుమారు 1,700 కోట్ల రూపాయలకు పైగా ఉందని అంచనా. క్లబ్, జాతీయ జట్టు తరఫున ఒక సీజన్‌లో ఆయన సగటున 55 మ్యాచ్‌లు ఆడుతారని లెక్కిస్తే, ఒక్క మ్యాచ్‌కు దాదాపు 30 కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. అంటే కేవలం 90 నిమిషాల ఆటతోనే రొనాల్డో సంపాదించే మొత్తం, సాధారణ ఉద్యోగి జీవితకాల సంపాదన కంటే ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. ఏడాదికి 12 లక్షల రూపాయల జీతం పొందే ఒక భారతీయ ఉద్యోగి, రొనాల్డో ఒక్క మ్యాచ్ ద్వారా సంపాదించే 30 కోట్ల రూపాయలను కూడబెట్టాలంటే దాదాపు 2,500 సంవత్సరాలు పనిచేయాల్సి ఉంటుంది. రొనాల్డో సంపద కేవలం జీతానికే పరిమితం కాదు. ఫుట్‌బాల్ కెరీర్‌లో సాధించిన విజయాలు, ప్రకటన ఒప్పందాలు, వ్యాపార పెట్టుబడులు, వ్యక్తిగత బ్రాండ్ విలువ, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఆదాయం ఆయన ఆస్తులను మరింత పెంచాయి. ప్రస్తుతం రొనాల్డో నికర ఆస్తి విలువ సుమారు 10,000 కోట్ల రూపాయలకు పైగా ఉందని అంతర్జాతీయ ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ మొత్తాన్ని ఒక సాధారణ ఉద్యోగి సంపాదించాలంటే దాదాపు 83 వేల సంవత్సరాలకు పైగా పనిచేయాల్సి వస్తుంది. అంటే వేల తరాల ఉద్యోగ జీవితాలు కలిపినా ఆ స్థాయి సంపదను అందుకోవడం అసాధ్యమే. రెండు దశాబ్దాలకు పైగా ప్రపంచ ఫుట్‌బాల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న రొనాల్డో, ఆటతో పాటు తన వ్యక్తిగత బ్రాండ్‌ను కూడా విజయవంతంగా మలచుకున్నారు. క్రీడా ప్రపంచంలో సంపాదనకు కొత్త నిర్వచనం ఇచ్చిన ఆటగాళ్లలో ఆయన ముందువరుసలో నిలిచారు. ఫుట్‌బాల్ మైదానంలో ఆయన ప్రదర్శన ఎంత అద్భుతమో, ఆర్థికంగా సాధించిన విజయాలు కూడా అంతే అసాధారణంగా ఉన్నాయని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. క్రిస్టియానో రొనాల్డో పేరు ఇప్పుడు కేవలం ఫుట్‌బాల్‌కే కాకుండా ప్రపంచ క్రీడా ఆర్థిక వ్యవస్థకు కూడా ప్రతీకగా మారింది.

# వైభవ్ అంతర్జాతీయ అరంగేట్రానికి అనిశ్చితి



**హైదరాబాద్, జూన్ 12 :** చిన్న వయసులోనే తన విధ్వంసకర బ్యాటింగ్‌తో భారత క్రికెట్‌లో సంచలనం సృష్టించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ అరంగేట్రంపై అనిశ్చితి నెలకొంది. ఐర్లాండ్‌లో జరుగాల్సిన టీ20 సిరీస్‌కు అక్కడి ఉద్రిక్త పరిస్థితులు అడ్డంకిగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌లోని బెల్‌ఫాస్ట్‌లో భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య టీ20 మ్యాచ్‌లు జరగాల్సి ఉంది. అయితే ఇటీవల అక్కడ చెలరేగిన హింసాత్మక అల్లర్లు, వలస వ్యతిరేక నిరసనల కారణంగా భద్రతా పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. దీంతో ఈ సిరీస్ నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే లిస్‌బర్న్‌లో నిర్వహించాల్సిన అంతర్ ప్రావిన్షియల్ టీ20 పోటీలను రద్దు చేశారు. భద్రతా కారణాల దృష్ట్యా పలు దేశీయ టోర్నీల షెడ్యూల్‌లను కూడా సమీక్షిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడే అవకాశం వాయిదా పడే పరిస్థితి ఏర్పడింది. భారత టీ20 జట్టులో స్థానం సంపాదించడం ద్వారా అత్యంత పిన్న వయసులో ఆ ఘనత సాధించిన ఆటగాళ్ల జాబితాలో చోటు దక్కించుకున్న వైభవ్ ప్రస్తుతం శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు సిరీస్‌లో 'ఇండియా–ఏ' జట్టు తరఫున ఆడుతున్నాడు. అతని అంతర్జాతీయ అరంగేట్రంపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఐర్లాండ్ క్రికెట్ బోర్డు విడుదల చేసిన ప్రకటనలో ఆటగాళ్లు, కోచ్‌లు, మ్యాచ్ అధికారులు, ప్రేక్షకుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపింది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని, వచ్చే కొన్ని రోజుల్లో తుది నిర్ణయం వెల్లడిస్తామని పేర్కొంది. ఇదే సమయంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి కూడా పరిస్థితులను నిశితంగా గమనిస్తోంది. బెల్‌ఫాస్ట్‌లో భద్రతా పరిస్థితులు మెరుగుపడకపోతే మ్యాచ్‌లను మరో నగరానికి తరలించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అన్ని అనుకూలంగా ఉంటే వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టేందుకు మార్గం సుగమం కానుంది. లేదంటే అతని అరంగేట్రం కోసం అభిమానులు మరికొంత కాలం వేచి చూడాల్సి రావచ్చు.

# భారత షూటింగ్‌కు తీరని లోటు.. జస్పాల్ రాణా కన్నుమూత



న్యూఢిల్లీ, జూన్ 12 :
భారత షూటింగ్ క్రీడా రంగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖ షూటర్, కోచ్ జస్పాల్ రాణా కన్నుమూశారు. ఆయన వయసు 49 సంవత్సరాలు. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశానికి ఎన్నో విజయాలు అందించిన ఆయన, అనంతరం కోచ్‌గా మారి కొత్త తరం షూటర్లను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మరణ వార్త భారత క్రీడా రంగాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఇటీవల జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన అంతర్జాతీయ షూటింగ్ పోటీలకు హాజరైన జస్పాల్ రాణా అక్కడ అస్వస్థతకు గురైనట్లు సమాచారం. అనంతరం స్వదేశానికి తిరిగి వస్తున్న సమయంలో ఆయన ఆరోగ్యం మరింత విషమించింది. ఢిల్లీ చేరుకున్న వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సహా అనేక అంతర్జాతీయ విజయాలను తన ఖాతాలో వేసుకున్న జస్పాల్ రాణా, భారత షూటింగ్ చరిత్రలో అత్యుత్తమ పిస్తోల్ షూటర్లలో ఒకరిగా గుర్తింపు పొందారు. క్రీడాకారుడిగా విజయవంతమైన ప్రయాణం అనంతరం కోచ్‌గా మారిన ఆయన యువ ప్రతిభను వెలికితీయడంలో విశేష కృషి చేశారు. జాతీయ జూనియర్ పిస్తోల్ జట్టుకు కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, సౌరభ్ చౌదరీ, అనీష్ భన్వాలా, చింకీ యాదవ్ వంటి ప్రతిభావంతులైన షూటర్లను తీర్చిదిద్దారు. అంతేకాకుండా ఒలింపిక్ పతక విజేత మనూ భాకర్ ఎదుగుదలలో కూడా ఆయన పాత్ర ఎంతో కీలకమైంది. ఒత్తిడిని అధిగమించి అత్యుత్తమ ప్రదర్శన ఎలా చేయాలో నేర్పిన గురువుగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో మనూ భాకర్ సాధించిన విజయాల వెనుక జస్పాల్ రాణా అందించిన శిక్షణ ప్రధాన కారణంగా క్రీడా వర్గాలు భావిస్తాయి. షూటింగ్‌లో సాంకేతిక నైపుణ్యాలతో పాటు మానసిక దృఢత్వాన్ని పెంపొందించడంలో ఆయనకు ప్రత్యేక ప్రతిభ ఉండేది. భారత షూటింగ్ అభివృద్ధికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం 2020లో ఆయనకు ద్రోణాచార్య పురస్కారాన్ని ప్రదానం చేసింది. క్రీడాకారుడిగా, కోచ్‌గా రెండు రంగాల్లోనూ చెరగని ముద్ర వేసిన జస్పాల్ రాణా భారత షూటింగ్‌కు మార్గదర్శిగా నిలిచారు. ఆయన మరణంతో భారత క్రీడా రంగం ఒక గొప్ప గురువును కోల్పోయింది. ఎన్నో తరాల షూటర్లకు స్ఫూర్తిగా నిలిచిన జస్పాల్ రాణా సేవలు భారత క్రీడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ ఖరారు..

## 14 జట్లతో మెగా సమరం

హైదరాబాద్, జూన్ 12 :
ప్రపంచ క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 2027 పురుషుల వన్డే ప్రపంచకప్‌కు సంబంధించిన కీలక వివరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రతిష్ఠాత్మక టోర్నీ అక్టోబర్ 4 నుంచి నవంబర్ 21 వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఈ మెగా టోర్నీకి ఆతిథ్యం ఇవ్వనున్నాయి. 2003 తర్వాత మరోసారి ఆఫ్రికా ఖండంలో వన్డే ప్రపంచకప్ జరగనుండటం విశేషం. మొత్తం 54 మ్యాచ్‌లు నిర్వహించనున్న ఈ టోర్నీలో అత్యధిక పోటీలు దక్షిణాఫ్రికాలోనే జరగనున్నాయి. దాదాపు 41 మ్యాచ్‌లకు దక్షిణాఫ్రికా వేదిక కానుండగా, జింబాబ్వేలో 8 నుంచి 10 మ్యాచ్‌లు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. నమీబియా మూడు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుంది. జింబాబ్వేలోని విక్టోరియా ఫాల్స్ ప్రాంతంలో కొత్త అంతర్జాతీయ స్థాయి స్టేడియం నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రపంచకప్‌కు ముందే ఈ వేదిక సిద్ధం చేయాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈసారి ప్రపంచకప్‌లో పాత ఫార్మాట్‌ను తిరిగి ప్రవేశపెడుతున్నారు. గత రెండు ఎడిషన్‌లలో 10 జట్లు మాత్రమే పాల్గొనగా, 2027 టోర్నీలో 14 జట్లు బరిలోకి దిగనున్నాయి. ఏడు జట్ల చొప్పున రెండు గ్రూపులుగా విభజించి లీగ్ దశ నిర్వహించనున్నారు. ప్రతి గ్రూప్ నుంచి తొలి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'సూపర్ సిక్స్' దశకు అర్హత సాధిస్తాయి. అక్కడి నుంచి అత్యుత్తమ ప్రదర్శన చేసిన జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకుంటాయి. దీంతో టోర్నీ మరింత పోటీభరితంగా మారనుంది. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు నేరుగా అర్హత లభించనుండగా, నమీబియా మాత్రం అర్హత పోటీల ద్వారా ప్రపంచకప్‌లో చోటు సంపాదించుకోవాల్సి ఉంటుంది. భవిష్యత్ అంతర్జాతీయ క్రికెట్ పర్యటనల ప్రణాళికలో భాగంగా జరగనున్న తొలి ప్రధాన టోర్నీ ఇదే. ప్రపంచకప్ షెడ్యూల్‌కు సంబంధించి తుది ఆమోదం త్వరలో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మండలి వార్షిక సమావేశంలో




లభించనుంది. అదే సమావేశంలో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ నిర్వహణ విధానంలో మార్పులు, మరిన్ని దేశాలకు అవకాశాల కల్పన వంటి అంశాలపై కూడా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. 14 జట్ల భాగస్వామ్యంతో, పాత ఫార్మాట్ పునరాగమనంతో 2027 ప్రపంచకప్ మరింత ఉత్కంఠభరితంగా సాగనుందని క్రికెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# ప్రపంచకప్ విజయానికి రోహిత్, కోహ్లీ కీలకం

## ఇర్ఫాన్ పఠాన్



హైదరాబాద్, జూన్ 12:
దక్షిణాఫ్రికాలో జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు టైటిల్ సాధించాలంటే సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల అనుభవం అత్యంత కీలకమని మాజీ భారత ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డారు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న తొలి వన్డేకు ముందు మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ ఇద్దరు స్టార్ ఆటగాళు జట్టుకు బలమైన ఆధారంగా నిలుస్తారని పేర్కొన్నారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు వేగం, బౌన్స్‌కు అనుకూలంగా ఉంటాయని గుర్తు చేసిన పఠాన్, అలాంటి పరిస్థితుల్లో రోహిత్ శర్మ ఆడే పుల్ షాట్లు భారత జట్టుకు పెద్ద ఆయుధంగా మారతాయని తెలిపారు. షార్ట్ పిచ్ బంతులను సమర్థంగా ఎదుర్కొంటూ ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి తీసుకురాగల సామర్థ్యం రోహిత్‌కు ఉందని ఆయన వివరించారు. మ్యాచ్ ఆరంభంలోనే దూకుడైన బ్యాటింగ్‌తో జట్టుకు బలమైన పునాది వేయగలడని అన్నారు. విరాట్ కోహ్లీ గురించి మాట్లాడిన పఠాన్, వన్డే క్రికెట్‌లో అతని నిలకడకు సాటిలేదని కొనియాడారు. ప్రారంభంలో వికెట్లు కోల్పోయిన పరిస్థితుల్లో ఇన్నింగ్స్‌ను చక్కదిద్దగల అరుదైన బ్యాటర్ కోహ్లీ అని చెప్పారు. ముఖ్యంగా లక్ష్య ఛేదనలో అతని రికార్డు అసాధారణమని, ఒత్తిడి పరిస్థితుల్లో కూడా ప్రశాంతంగా ఆడుతూ జట్టును విజయతీరాలకు చేర్చగలడని పేర్కొన్నారు. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో కోహ్లీ అనుభవం భారత జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. వికెట్ కీపర్ బ్యాటర్ల ఎంపికపై కూడా పఠాన్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. కేఎల్ రాహుల్‌ను ప్రధాన వికెట్ కీపర్‌గా కొనసాగించాలని సూచించారు. ఐదో లేదా ఆరో స్థానంలో రాహుల్ బ్యాటింగ్ చేయడం జట్టుకు సమతుల్యతను తీసుకువస్తుందని అన్నారు. బ్యాకప్ కీపర్‌గా ఇషాన్ కిషన్ మంచి ఎంపిక అని, వేగవంతమైన బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో అతనికి మంచి అనుభవం ఉందని చెప్పారు. అదే సమయంలో సంజూ శాంసన్‌కు కూడా అవకాశాలు ఇవ్వాలని పఠాన్ అభిప్రాయపడ్డారు. తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ నిలకడగా రాణిస్తున్న సంజూను ఎంపికదారులు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మొత్తంగా చూస్తే, రోహిత్ శర్మ అందించే దూకుడైన ఆరంభం, విరాట్ కోహ్లీ అందించే స్థిరత్వం, మధ్య వరుసలో సరైన సమతుల్యతే ప్రపంచకప్‌లో భారత జట్టు విజయావకాశాలను పెంచుతాయని ఇర్ఫాన్ పఠాన్ విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో మెక్సికో విజయం



మెక్సికో సిటీ, జూన్ 12
ఫుట్‌బాల్ ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఆతిథ్య దేశం మెక్సికో విజయంతో శుభారంభం చేసింది. గ్రూప్–ఏలో భాగంగా జరిగిన పోరులో మెక్సికో జట్టు దక్షిణాఫ్రికాపై 2–0 గోల్స్ తేడాతో గెలుపొందింది. అయితే ఈ మ్యాచ్‌లో ముగ్గురు ఆటగాళ్లకు ఎర్ర కార్డులు జారీ కావడం ప్రత్యేక చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్‌ను నిర్వహించిన బ్రెజిల్‌కు చెందిన న్యాయనిర్ణేత విల్టన్ సంపాయో కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. దక్షిణాఫ్రికా ఆటగాళ్లు వై. సిథోల్, టీ. జ్వానేలతో పాటు మెక్సికో ఆటగాడు సీ. మోంటిస్‌కు ఎర్ర కార్డులు చూపించారు. దీంతో ముగ్గురు ఆటగాళ్లు మ్యాచ్ మధ్యలోనే మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ఆట ప్రారంభమైన తొమ్మిదో నిమిషంలోనే మెక్సికో ఆటగాడు జే. క్విన్నోన్స్ తొలి గోల్ నమోదు చేసి జట్టుకు ఆధిక్యం అందించాడు. అనంతరం రెండో అర్ధభాగంలో 67వ నిమిషంలో ఆర్. జిమినేజ్ మరో గోల్ సాధించి మెక్సికో ఆధిక్యాన్ని 2–0కు పెంచాడు. గోల్స్ కోసం దక్షిణాఫ్రికా తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఎర్ర కార్డుల కారణంగా ఒక దశలో కేవలం తొమ్మిది మంది ఆటగాళ్లతోనే ఆ జట్టు మ్యాచ్ కొనసాగించాల్సి వచ్చింది. గతంలో ఖతార్‌లో జరిగిన 2022 ప్రపంచకప్ మొత్తం టోర్నీలో కేవలం నలుగురు ఆటగాళ్లకే ఎర్ర కార్డులు జారీ చేయగా, ఈసారి టోర్నీ తొలి మ్యాచ్‌లోనే ముగ్గురు ఆటగాళ్లకు ఎర్ర కార్డులు ఇవ్వడం విశేషంగా మారింది. మెక్సికో మూడోసారి ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇస్తోంది. గతంలో 1970, 1986 సంవత్సరాల్లో కూడా ఈ దేశమే టోర్నీని నిర్వహించింది. ఈసారి కూడా మెక్సికో సిటీలోని ప్రసిద్ధ అజ్‌టెకా స్టేడియంలోనే ప్రారంభ మ్యాచ్ జరిగింది. ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రముఖ గాయని షకీరా తన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. రంగురంగుల కార్యక్రమాలతో మెక్సికోలో పండుగ వాతావరణం నెలకొంది. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 14వ స్థానంలో ఉన్న మెక్సికో జట్టు, తొలి మ్యాచ్‌లోనే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించి టైటిల్ పోరుకు సిద్ధమని సంకేతాలు ఇచ్చింది.

# ఓటీటీలోకి ‘వీరభద్రుడు’..

## సూర్య బ్లాక్‌బస్టర్‌కు డిజిటల్ ఎంట్రీ




హైదరాబాద్, జూన్ 12 :
కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, నటి త్రిష ప్రధాన పాత్రల్లో నటించిన ఫాంటసీ కోర్టు నేపథ్య చిత్రం ‘కరుప్పు’ ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. తెలుగులో ‘వీరభద్రుడు’ పేరుతో విడుదలైన ఈ చిత్రం జూన్ 12 నుంచి ప్రముఖ డిజిటల్ వేదికలో ప్రసారమవుతోంది. థియేటర్లలో ఘనవిజయం సాధించిన ఈ సినిమా ఇప్పుడు ఇంటి వద్ద నుంచే ప్రేక్షకులకు అందుబాటులోకి వచ్చింది. కొంతకాలంగా భారీ విజయానికి ఎదురుచూస్తున్న సూర్యకు ఈ చిత్రం గొప్ప ఊరటనిచ్చింది. విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల ఆదరణ పొందిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సూర్య కెరీర్‌లో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. బలమైన కథ, వినూత్న కథనం, భావోద్వేగాలతో కూడిన సన్నివేశాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాధారణంగా భారీ విజయాలు సాధించిన చిత్రాలు రెండు నెలల వరకు థియేటర్లలో కొనసాగిన తర్వాతే డిజిటల్ వేదికల్లోకి వస్తుంటాయి. అయితే ‘వీరభద్రుడు’ చిత్రం మాత్రం కేవలం నాలుగు వారాల్లోనే ఓటీటీ విడుదలకు రావడం సినీ వర్గాల్లో చర్చకు దారితీసింది. సినిమా డిజిటల్ హక్కులను ముందుగానే భారీ మొత్తానికి విక్రయించడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. థియేటర్లలో క్రేజ్ కొనసాగుతున్న సమయంలోనే ఓటీటీలో విడుదల చేయడం ద్వారా మరింత మంది ప్రేక్షకులకు చేరువ కావచ్చని భావించినట్లు సమాచారం. ఈ చిత్రానికి దర్శకుడు ఆర్జే బాలాజీ దర్శకత్వం వహించారు. న్యాయ వ్యవస్థలోని అవినీతి, అధికార దుర్వినియోగం, సామాజిక సమస్యలను ఫాంటసీ కథాంశంతో మేళవిస్తూ ఆయన రూపొందించిన కథ ప్రేక్షకులను ఆకట్టుకుంది. అవినీతి న్యాయవాది బేబీ కన్నన్‌కు ఎదురుగా గ్రామదేవత కరుప్పుసామి మానవ రూపంలో ప్రత్యక్షమై న్యాయం కోసం పోరాడే కథాంశం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పురాణ గాథలు, ఆధునిక న్యాయ వ్యవస్థ, సామాజిక సందేశం, రాజకీయ కోణాలు, భావోద్వేగాలు అన్నింటినీ సమపాళ్లలో మిళితం చేస్తూ రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ముఖ్యంగా సూర్య నటన, త్రిష పాత్ర రూపకల్పన, అత్యాధునిక దృశ్య ప్రభావాలు సినిమాకు అదనపు బలంగా నిలిచాయి. థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమైన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలోనూ అదే స్థాయిలో ఆదరణ పొందుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.




## ‘జైలర్ 2’లో హృతిక్ కామియో?

సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్ చిత్రం ‘జైలర్ 2’పై మరో ఆసక్తికర ప్రచారం సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ రూపొందిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్ అతిథి పాత్ర పోషించనున్నారనే ప్రచారం జరిగినప్పటికీ, తాజా సమాచారం ప్రకారం హృతిక్ రోషన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ వార్త నిజమైతే రజనీకాంత్, హృతిక్ రోషన్ దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ ఒకే తెరపై కనిపించనున్నారనే ఆసక్తి నెలకొంది. గతంలో 1986లో విడుదలైన ‘భగవాన్ దాదా’ చిత్రంలో వీరిద్దరూ కలిసి నటించారు. ఆ తర్వాత మళ్లీ ఈ కలయిక జరగలేదు. సినీ వర్గాల సమాచారం ప్రకారం హృతిక్‌కు సంబంధించిన కీలక సన్నివేశాలను జూన్ 22, 23 తేదీల్లో చెన్నైలో ప్రత్యేకంగా నిర్మించిన సెట్స్‌లో చిత్రీకరించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఈ వార్తతోనే ‘జైలర్ 2’పై ప్రేక్షకుల్లో ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్, మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్, ఎస్.జె.సూర్య, రమ్యకృష్ణ, మిర్నా మీనన్, యోగి బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, తొలి భాగం సాధించిన భారీ విజయాన్ని మించి రెండో భాగాన్ని రూపొందించేందుకు చిత్రబృందం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. యాక్షన్, భావోద్వేగాలు, స్టార్ కాస్ట్ కలయికతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఈ ఏడాది చివర్లో ప్రపంచవ్యాప్తంగా విడుదలయ్యే అవకాశముంది. అయితే హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రకు సంబంధించి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ వార్తలను ప్రచారంగానే పరిగణించాలని సినీ విశ్లేషకులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ‘జైలర్ 2’కు సంబంధించిన ప్రతి అప్‌డేట్ అభిమానుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## ‘పెద్ది’లో జాన్వీ పాత్రపై చర్చ..

### పారితోషికం కూడా హాట్ టాపిక్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ‘పెద్ది’ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. గ్రామీణ క్రీడల నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాలో రామ్ చరణ్ నటనకు ప్రేక్షకుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయి. అయితే సినిమా విజయంతో పాటు హీరోయిన్ జాన్వీ కపూర్ పోషించిన పాత్రపై సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో విస్తృత చర్చ సాగుతోంది. సినిమా కథ మొత్తం ప్రధానంగా హీరో పాత్ర చుట్టూనే తిరగడంతో జాన్వీ పాత్రకు ఆశించిన స్థాయిలో ప్రాధాన్యం దక్కలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పాత్రకు తగిన భావోద్వేగ బలం లేకపోవడం, కథా ప్రవాహంలో ఆమె పాత్ర ప్రభావం తక్కువగా కనిపించడం వంటి అంశాలపై ప్రేక్షకులు స్పందిస్తున్నారు. కొందరు విశ్లేషకులు అయితే ఆ పాత్రను కేవలం వాణిజ్య అవసరాల కోసమే చేర్చినట్టుగా అనిపించిందని వ్యాఖ్యానిస్తున్నారు. సినిమా విడుదల అనంతరం జరిగిన ప్రచార కార్యక్రమాల్లో కూడా జాన్వీ పెద్దగా కనిపించకపోవడం చర్చకు దారితీసింది. దీంతో ఆమె పాత్రకు వచ్చిన స్పందన కారణంగానే ప్రమోషన్లకు దూరంగా ఉందా అనే ఊహాగానాలు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. అయితే దీనిపై చిత్రబృందం నుంచి ఎలాంటి అధికారిక స్పందన వెలువడలేదు. ఇదిలా ఉండగా, ‘పెద్ది’ చిత్రం కోసం జాన్వీ కపూర్ సుమారు రూ.8 కోట్ల పారితోషికం అందుకుందనే వార్తలు సినీ పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో నటించిన ‘దేవర’ చిత్రంతో పోలిస్తే ఆమె రెమ్యునరేషన్ గణనీయంగా పెరిగినట్లు ప్రచారం జరుగుతోంది. పాత్రకు వచ్చిన స్పందనతో పోలిస్తే ఈ మొత్తం అధికమనే అభిప్రాయాలు కొందరు వ్యక్తం చేస్తుండగా, స్టార్ ఇమేజ్, మార్కెట్ విలువ ఆధారంగానే పారితోషికాలు నిర్ణయిస్తారని అభిమానులు చెబుతున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమలో వరుసగా భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకున్నప్పటికీ, నటిగా జాన్వీ ఇప్పటికీ తన ప్రత్యేక ముద్ర వేయలేకపోయిందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త తెలుగు ప్రాజెక్టులు లేవన్న వార్తల నేపథ్యంలో టాలీవుడ్‌లో ఆమె భవిష్యత్ ప్రయాణంపై కూడా ఆసక్తికర చర్చ సాగుతోంది.





## ‘ఓజీ 2’పై మళ్లీ జోష్.. అభిమానుల్లో కొత్త ఆశలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ఓజీ’ భారీ విజయాన్ని అందుకున్న తర్వాత దాని సీక్వెల్‌పై మరోసారి ఆసక్తికర చర్చ మొదలైంది. గ్యాంగ్‌స్టర్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి పవన్ కెరీర్‌లో మరో ఘన విజయంగా నిలిచింది. సినిమా విడుదల సమయంలోనే దర్శకుడు సుజీత్ ‘ఓజీ 2’ను ప్రకటించడంతో అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే పవన్ కళ్యాణ్ రాజకీయ బాధ్యతలు, దర్శకుడు సుజీత్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో రెండో భాగం ఎప్పుడు ప్రారంభమవుతుందన్న సందేహాలు నెలకొన్నాయి. తాజాగా పవన్ కళ్యాణ్‌కు చెందిన నిర్మాణ సంస్థ చేసిన సోషల్ మీడియా పోస్టు ఈ ప్రాజెక్ట్‌పై మళ్లీ ఆశలు రేకెత్తించింది. “మాట ఇచ్చినట్లే ఆయన చేస్తారు. సమయం ఎప్పుడనేది ఆయనే చెబుతారు. సుజీత్ విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత దీనిపై చర్చిద్దాం” అంటూ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. దీంతో ‘ఓజీ 2’ ప్రాజెక్ట్ నిలిచిపోలేదని, సరైన సమయంలో అధికారికంగా ముందుకు వెళ్లే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం దర్శకుడు సుజీత్ హీరో నానితో కొత్త చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమవుతున్నప్పటికీ, ఆ ప్రాజెక్ట్ పూర్తైన తర్వాత ‘ఓజీ 2’పై దృష్టి సారించే అవకాశం ఉందని సమాచారం. మరోవైపు పవన్ కళ్యాణ్ కూడా రాజకీయ కార్యక్రమాలకు అనుగుణంగా సినిమా కోసం సమయం కేటాయించవచ్చని టాలీవుడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ‘ఓజీ’ చిత్రంలో పవన్ కళ్యాణ్ ఓజాస్ గంభీర అనే శక్తివంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. జపాన్ నుంచి ముంబైకి వచ్చి అండర్‌వరల్డ్‌ను శాసించే స్థాయికి ఎదిగిన అతని ప్రయాణం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. కథ చివర్లో జపాన్‌లోని అతని గత జీవితం గురించి కొన్ని సూచనలు ఇవ్వడం ద్వారా దర్శకుడు సీక్వెల్‌కు బలమైన పునాది వేశాడు. అయితే ‘ఓజీ 2’ సాధారణ సీక్వెల్ కాకుండా ప్రీక్వెల్‌గా రూపొందే అవకాశాలు ఉన్నాయని గతంలో దర్శకుడు సుజీత్ సంకేతాలు ఇచ్చాడు. ‘ఓజీ’ విశ్వాన్ని విస్తరించేందుకు రూపొందించిన ప్రత్యేక పుస్తకంలోని కథాంశాలను ఆధారంగా తీసుకుని కొత్త కథను తెరకెక్కించే ఆలోచన ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా జపాన్ నేపథ్యంలోని సంఘటనలు, ఓజాస్ గంభీర కుటుంబ చరిత్ర, అతని తండ్రి మరణం వెనుక ఉన్న శత్రువులపై ప్రతీకారం వంటి అంశాలు కథలో కీలకంగా ఉండవచ్చని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ‘ఓజీ 2’పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. పవన్ కళ్యాణ్ స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ పాత్రను మరోసారి తెరపై చూడాలన్న ఉత్సాహం అభిమానుల్లో ఇప్పటికే కనిపిస్తోంది. ‘ఓజీ’ సృష్టించిన ప్రభంజనాన్ని దృష్టిలో ఉంచుకుంటే, రెండో భాగంపై అంచనాలు మరింత భారీగా ఉండనున్నాయి.

## ప్రయోగాత్మక ‘సింగ్ గీతం’.. అందరికీ కాదు!

హైదరాబాద్, జూన్ 12 :
94 ఏళ్ల వయసులోనూ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు మరో వినూత్న ప్రయోగంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఫాంటసీ, కామెడీ, సంగీతం కలగలిపిన ‘సింగ్ గీతం’ చిత్రాన్ని ఆయన తెరకెక్కించగా, వైజయంతి మూవీస్, స్వప్న సినిమాస్ సంస్థలు నిర్మించాయి. మాటల్లేకుండా ‘పుష్పక విమానం’ వంటి క్లాసిక్ అందించిన సింగీతం.. ఈసారి “మాటలే పాటలైతే?” అనే విభిన్న కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే ప్రయత్నం చేశారు. కథ విషయానికి వస్తే.. జైలు నుంచి విడుదలైన ప్రతాప్ తన తండ్రి ఆస్తి కోసం కుబేరపురం అనే రహస్య గ్రామానికి వెళ్తాడు. అక్కడ గౌరీ అనే యువతిని, మైనింగ్ వ్యాపారవేత్త రేణును కలుస్తాడు. గ్రామంలో ఉన్న ఏకైక భారీ వృక్షాన్ని కూల్చివేయడంతో కథ కీలక మలుపు తిరుగుతుంది. ప్రకృతిని నాశనం చేసిన మనుషులపై ఆవేదన చెందిన గౌరీ కుబేరుడిని ప్రశ్నించగా, గ్రామ ప్రజలందరికీ విచిత్రమైన శాపం పడుతుంది. వారు మాట్లాడే ప్రతి మాట పాటగా మారిపోతుంది. అబద్ధాలు చెప్పలేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆ తర్వాత జరిగిన పరిణామాలే చిత్ర ప్రధాన కథ. సినిమా ప్రధాన బలం దాని వినూత్న ఆలోచన. మాటలను పాటల రూపంలో వినిపిస్తూ కథను నడిపించడం సులభమైన విషయం కాదు. సింగీతం ఆ సవాల్‌ను స్వీకరించి తెరపై కొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి విలువ, మానవ స్వార్థం వంటి అంశాలను ప్రతీకాత్మకంగా చూపించారు. కమర్షియల్ ఫార్ములాలకు దూరంగా, పూర్తిగా భావోద్వేగాలు మరియు సందేశం ఆధారంగా సినిమా సాగుతుంది. సాంకేతిక విభాగంలో సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ చేసిన కృషి ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రతి సంభాషణను సంగీతబద్ధం చేయడం పెద్ద సవాలే అయినా, ఆయన తన అనుభవంతో సినిమాకు ప్రత్యేకమైన శ్రావ్యతను అందించారు. అయితే కొందరు నటీనటుల గానశైలి ప్రేక్షకులకు కొంత అసౌకర్యంగా అనిపించే అవకాశం ఉంది. ఛాయాగ్రహణం, కళాదర్శకత్వం కూడా సినిమాకు మంచి బలంగా నిలిచాయి. గ్రామ వాతావరణాన్ని, ఫాంటసీ ప్రపంచాన్ని తెరపై అందంగా ఆవిష్కరించారు. నటీనటులందరూ తమ పాత్రల పరిధిలో చక్కటి నటన కనబరిచారు. ముఖ్యంగా కొత్తగా పరిచయమైన నటీనటులు పాత్రల్లో సహజత్వాన్ని ప్రదర్శించారు. అయితే కథనం కొన్నిచోట్ల నెమ్మదిగా సాగడం, ఎడిటింగ్ మరింత కుదిస్తే బాగుండేదనే భావన కలుగుతుంది. మొత్తంగా చూస్తే ‘సింగ్ గీతం’ సాధారణ ప్రేక్షకుల కోసం రూపొందిన సినిమా కాదు. కొత్త ఆలోచనలు, ప్రయోగాత్మక కథలు, సందేశాత్మక చిత్రాలను ఇష్టపడే వారికి ఇది ఆసక్తికర అనుభూతిని అందిస్తుంది. అయితే పూర్తిగా కమర్షియల్ అంశాలు, మాస్ వినోదం ఆశించే ప్రేక్షకులకు ఈ చిత్రం అంతగా నచ్చకపోవచ్చు. రేటింగ్: 2.5/5




## యవ్వన రహస్యం చెప్పిన త్రిష



చెన్నై, జూన్ 12
దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలకుపైగా విజయవంతమైన ప్రయాణం కొనసాగిస్తున్న స్టార్ నటి త్రిష కృష్ణన్ గతంలో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్, ఇష్టాలు, అలవాట్లు, ఫిట్‌నెస్ రహస్యాల గురించి అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. నటిగా ఉండటంలో అత్యుత్తమ విషయం ప్రేక్షకుల ప్రేమ, అభిమానమని చెప్పిన ఆమె.. తన గురించి నిజం కాని కథనాలు ప్రచారంలోకి రావడం మాత్రం బాధ కలిగిస్తుందని తెలిపారు. తనకు పుస్తకాలు చదవడం అంటే ఎంతో ఇష్టమని, ప్రయాణాల్లో కూడా పుస్తకం తప్పనిసరిగా వెంట తీసుకెళ్తానని చెప్పారు. జీవితంలో ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకాలుగా ‘తన ఫెరారీని అమ్ముకున్న సన్యాసి’, ‘రసవాది’, ‘డ్రాగన్ పచ్చబొట్టు ఉన్న యువతి’ పుస్తకాలను సూచించారు. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన ఓ ప్రముఖ కల్పిత కథా ధారావాహికలోని ఖలీసీ పాత్ర తనకు ఎంతో ఇష్టమని, అవకాశం వస్తే అలాంటి పాత్రలో నటించాలని ఉందన్నారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com